


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి : 05 సంచిక : 131 పేజీలు : 8

ఆదివారం19-10-2025 వెల : 5/-

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## జగన్ కుట్రలను తిప్పికొట్టాలి

### పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు పిలుపు



అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వంపై జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని పార్టీ శ్రేణులన్నీ కలిసికట్టుగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. మంత్రులు స్పందిస్తున్నారు కదా అని పార్టీ నేతలు మిన్నకుండిపోతే సరిపోదని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశమై పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై జగన్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించాలని చంద్రబాబు సూచించారు. "ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవడంలో మంత్రులతో పాటు పార్టీ నేతలు కూడా సమాంతరంగా పనిచేయాలి. జగన్ చేస్తున్న అబద్ధాలను మీడియా ముఖంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది" అని

మిగతా 2లో

## ఈసారి ధాన్యం కొనుగోలు పండుగలా జరగాలి



### రైతులకు ఎలాంటి కష్టం రాకూడదన్న మంత్రి నాదెండ్ల

అమరావతి (ప్రశ్న న్యూస్) రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. విజయవాడలోని హోటల్ వివాంతలో నేడు మంత్రి నాదెండ్ల అధ్యక్షతన అధికారులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్ మెంట్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, గత ఏడాది ధాన్యం కొనుగోలు సమయంలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను

మిగతా 2లో

# సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు

- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
-సీఎస్, సీఎంవో కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశం
-కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల పనితీరుపై అసంతృప్తి
-రెండేళ్లు అయినా కొంత మంది తీరులో మార్పులేదని స్పష్టం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు ఐఏఎస్ అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని అధికారులకు క్లాస్ పీకారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల అమలులో అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, డిపార్ట్‌మెంట్ హెడ్‌లు (హెచ్‌ఓడిలు) తమ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరించారు. సీఎస్ రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దు**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కొందరు అధికారులు పని తీరులో మార్పు రాలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ అధికారి అయినా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సహించేది లేదు అని హెచ్చరించారు. అధికారుల అలసత్వం విడనాడి, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలు, లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నతాధికారులు విధులు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు సొంతంగా

మిగతా 2లో



## పాకిస్థాన్ భూభాగమంతా మా రేంజ్‌లోనే ఉంది

### -రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ రంగం సరికొత్త మైలురాయిని చేరుకుంది. అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణి వ్యవస్థ తొలి బ్యాచ్‌ను ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో విజయవంతంగా ఉత్పత్తి చేశారు. వాటిని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భారత సైన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా సైన్యం పరాక్రమం, సంసిద్ధతను ప్రశంసిస్తూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పొరుగుదేశం పాకిస్థాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ క్షిపణి రేంజ్‌లోనే ఉందని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమేనన్న కేంద్ర మంత్రి ప్రత్యర్థులు ఇకపై బ్రహ్మోస్ నుంచి తప్పించుకోలేరని అన్నారు. బ్రహ్మోస్ క్షిపణుల ప్రాముఖ్యతను వివరిస్తూ "ఇది కేవలం ఒక క్షిపణి మాత్రమే కాదు, భారతదేశ సామర్థ్యానికి ప్రతీక. వేగం, కచ్చితత్వం, శక్తి అనే మూడు లక్షణాలతో బ్రహ్మోస్ ప్రపంచంలోనే అత్యుత్తమ క్షిపణుల్లో ఒకటిగా నిలిచింది. బ్రహ్మోస్ మన సైన్యం, నౌకాదళం, వైమానిక దళాలకు వెన్నెముకగా మారింది." అని కొనియాడారు.'ఆపరేషన్ సిందూర్' భారతదేశ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిందన్న కేంద్ర మంత్రి.. భారత్‌కు గెలుపు అలవాటుగా మారిందన్నారు. సిందూర్ సమయంలో బ్రహ్మోస్ కేవలం ఒక వ్యవస్థగానే కాకుండా మన దేశ భద్రతకు రుజువుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ కేవలం ట్రైలర్ మాత్రమేనని ఆ ట్రైలర్ చూసే పాకిస్థాన్‌కు భారత శక్తి

మిగతా 2లో



## తెలంగాణ బంద్ సక్సెస్

### -బీసీల జంగ్ సైరన్ దద్దరిల్లిందిగా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఉదయం నుంచే మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వామపక్షాలు సహా పలు రాజకీయపార్టీల నేతలు రోడ్లపైకి వచ్చి

మిగతా 2లో

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే ఉద్యోగుల వేతనంలో కోత



-శిల్ప కళావేదికలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్య
-తల్లిదండ్రులను పట్టించుకోకపోతే 15 శాతం వరకు కోత విధిస్తామని వెల్లడి
-తల్లిదండ్రులు, పుట్టి పెరిగిన ఊరును అభివృద్ధి చేసుకోవడం మన బాధ్యత అన్న సీఎం



## ప్రశాంత్ కిశోర్ పార్టీ గురించి ఎన్నికల తర్వాత మాట్లాడుకుందాం

-ప్రతిపక్షాలకు ఓటమి భయం పట్టుకుందన్న అమిత్ షా

## కష్టాల్లో పద్మశ్రీ మొగులయ్య

### -భరోసా ఇచ్చిన కేటీఆర్



2లో

## ఆర్థిక వెసులుబాటు వస్తే పీఆర్సీ కూడా ఇస్తాం

### ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం చంద్రబాబు



2లో

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొత్త టీచర్స్ ఫెడరేషన్ ఏర్పాటు

-తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొత్త టీచర్స్ ఫెడరేషన్ ఏర్పాటు



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 19 అక్టోబర్2025

# సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు

నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని సీఎం రేవంత్ రెడ్డి క్లాస్ పీకారు.

**ముఖ్యమైన దస్త్రాలు ఆగిపోవడానికి వీల్లేదు**

రాష్ట్రాభివృద్ధితోపాటు రాష్ట్ర ప్రజలందరి సంక్షేమం కోసం అధికారులు కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే పనులు వేగవంతం అవుతాయని ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలి అని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖల కార్యదర్శుల నుండి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకోవాలని పనుల పురోగతిని సమీక్షించాలని సీఎస్ రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కీలక దస్త్రాలు, పనులు ఎక్కడా ఆగిపోవడానికి వీల్లేదు అని చెప్పుకొచ్చారు. కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధులు రాబట్టుకునే కార్యచరణను వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన అమలు చేయడంలో ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను తన దృష్టికి తీసుకురావాలని సీఎంఓ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**పెండింగ్ బకాయిలపై ఫోకస్ పెట్టండి**

మరోవైపు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ నిధులపైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేంద్ర గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద వచ్చే నిధులను తక్షణమే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల కార్యదర్శులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్ర వాటా చెల్లించి పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదల కోసం ఎదురుచూస్తున్న పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. తమ పరిధిలోని శాఖలపై ప్రతివారం తనకు నివేదికలు అందజేయాలని ప్రగతిని సమీక్షిస్తానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంఓ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# తెలంగాణ బంద్ సక్సెస్

నిరసనలు, ధర్నాలు, మానవహారాలు చేపట్టారు.

**డిపోలకే పరిమితం అయిన ఆర్టీసీ బస్సులు**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద బస్సులను అడ్డుకున్నారు. దీంతో హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. రవాణా సౌకర్యం లేక ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని పలు ప్రాంతాల్లో క్యాబ్లు, ప్రైవేటు రవాణా వాహనాల డ్రైవర్లు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

**బీసీ బంద్ లో అన్ని జిల్లాలలో ధర్నాలు, రాస్తారోకోలు**

బంద్ కు మద్దతుగా వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడగా, విద్యా సంస్థల యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. అత్యవసర సేవలకు మాత్రం బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఆసిఫాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, కామారెడ్డి, జగిత్యాల, నల్లగొండ, కొత్తగూడెం, సిరిసిల్ల, నిర్మల్, మెదక్,నాగర్ కర్నూల్, వరంగల్ , హన్మకొండ తదితర జిల్లాల కేంద్రాల్లో బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

**తెలంగాణా బంద్ లో పాల్గొన్న కాంగ్రెస్ మంత్రులు**

బీసీ జేఏసీ నాయకులు హైకోర్టు స్టే ఆర్డర్ ను నిరసిస్తూ తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మంత్రులు సైతం బంద్ లో పాల్గొన్నారు. మంత్రులు కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన దేనిని డిమాండ్ చేశారు బిజెపి, బి ఆర్ ఎస్ తోడు దొంగలని బీసీ ద్రోహులని మండిపడ్డారు.

**బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వాల్సిందే**

రాష్ట్ర గవర్నర్ ఒక్క సంతకం పెట్టి బిసి బిల్లుకు ఆ సమస్య వచ్చేది కాదని ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేవని, బిజెపి డ్రామా వల్లనే, బీసీల ఆశలన్నీ అడియాసలయ్యాయి అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రావలసిన న్యాయమైన వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

**బంద్ లో పాల్గొన్న కవిత**

మరోవైపు కేసీఆర్ తనయ కవిత కూడా బంద్ లో పాల్గొన్నారు. ఖైరతాబాద్లో బంద్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పాల్గొన్నారు. ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించిన మానవహారం లో పాల్గొన్న కవిత బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించే వరకు తమ ఆందోళన విరమించేది లేదన్నారు.

# ఈసారి ధాన్యం కొనుగోలు పండుగలా జరగాలి

ఈ ఏడాది ముందస్తు ప్రణాళికలతో పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గోనె సంచులు, లేబర్, ట్రాన్స్‌పోర్ట్ వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గోనె సంచుల సరఫరాలో దళారులను అరికట్టడానికి జాయింట్ కలెక్టర్లు చొరవ తీసుకోవాలని, దీనికి సంబంధించి జిల్లా పోలీసు శాఖ నుంచి ప్రత్యేక విధివిధానాలు విడుదల చేస్తామని తెలిపారు.

పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్‌కు వ్యతిరేకంగా రైస్ మిల్లర్లు ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారులకు మంత్రి నిర్దేశించారు. ఈ అంశాన్ని అగ్రిమెంట్లలో స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించారు. ఎఫ్ సీఐకి 60 రోజుల్లో బియ్యం సరఫరా చేసే రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షిస్తామని, ప్రతి అంశం డాష్‌బోర్డులో అందుబాటులో ఉంటుందని చెప్పారు. పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన అధికారులు పిలుపునిచ్చారు. గత ఏడాది అకాల వర్షాల కారణంగా 30,000 టార్పాలను పంపిణీ చేసినట్లు గుర్తు చేస్తూ, ఈసారి కూడా అవసరాన్ని బట్టి ముందస్తుగా టార్పాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో రైతులు ధాన్యం విక్రయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫార్మర్ ఫ్రెండ్లీ విధానాల ద్వారా రైతులకు స్వేచ్ఛను కల్పించిందని అన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన సమయంలో ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు.

రైతులు సులభంగా వాట్సాప్‌లో "హాయ్" అని సందేశం పంపడం ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియలో చేరే సౌకర్యాన్ని కల్పించామని, విక్రయించిన 24 నుంచి 48 గంటలలోపే రైతు ఖాతాల్లో నగదు జమ చేసిన విషయాలను గుర్తు చేశారు. ఈ వర్క్‌షాప్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, సివిల్ సప్లై కార్పొరేషన్ వీసీ %à% ఎండీ ఢిల్లీ రావు, వ్యవసాయ శాఖ ఎండి మంజీర్ జిలాని, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్. గోవిందరావు, ఎఫ్ సీఐ జీఎం విజయ్ కుమార్ యాదవ్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై డీఎంలు, డీఎస్ఓలు,

# కష్టాల్లో పద్మశ్రీ మొగులయ్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పద్మశ్రీ అవార్డు గ్రహీత, దర్శనం మొగులయ్యకు భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మొగులయ్య కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి తన సమస్యలు చెప్పుకున్నారు. మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కేటీఆర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా మొగులయ్య తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్, మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం తనకు హయత్ నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుండి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కేటీఆర్‌కు వివరించారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువైన భూమిని తనకు ఉచితంగా అందిస్తే దీన్ని కొంతమంది కబ్జాదారులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని మొగులయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను కట్టుకున్న గోడలను ఇంటిని కూడా కూలగొట్టారని, కోర్టు కేసులు వేసి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కాపాడాలని కేటీఆర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంలో అనేక సార్లు కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లిన తనకు పరిష్కారం దొరకలేదని, తనకు అండగా నిలవాలని కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన కేటీఆర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మొగులయ్యకు గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో కొందరు వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కోరారు. అలాగే, మొగులయ్య ఆ స్థలంలో కట్టుకున్న గదిని కూడా కొంతమంది కూల్చివేసిన పరిస్థితి ఉందని మొగులయ్య చెప్పారని పేర్కొన్నారు. మొగులయ్య భూమికి, ఆయన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు కేటీఆర్ సూచించారు. అవసరమైతే, మొగులయ్యకు ఎదురవుతున్న న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా సహాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

ఒకప్పుడు లింగాల అడవుల్లో 12 మెట్ల కిన్నెర వాయించుకునే తనకు అప్పటి ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ప్రేమతోనే గుర్తింపు దక్కిందని మొగులయ్య అన్నారు. కేసీఆర్ తనను గుర్తించి ఉగాది పురస్కారం ఇచ్చి గౌరవించడం వల్లనే తన కళ ప్రపంచం దృష్టికి చేరిందని, తదనంతరం పద్మశ్రీ అవార్డు కూడా దక్కిందని పేర్కొన్నారు. కేసీఆర్ తమ కుటుంబం కోసం చేసిన సహాయానికి, తమ కష్టాలన్నీ తీర్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు.

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే

# ఉద్యోగుల వేతనంలో కోత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనంలో 10 నుంచి 15 శాతం కోత విధించి ఆ మొత్తాన్ని వారి తల్లిదండ్రుల ఖాతా జమ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ శిల్ప కళావేదికలో జరిగిన కార్యక్రమంలో గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు, పుట్టి పెరిగిన ఊరును అభివృద్ధి చేసుకోవడం మన బాధ్యత అని అన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, ఉద్యోగుల జీతం వారి ఖాతాలో జమ అయిన వెంటనే, కొంత మొత్తాన్ని వారి తల్లిదండ్రుల ఖాతాలో వేసేలా చట్టం తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. శ్రీకాంతాచారి, వేణుగోపాల్ రెడ్డి, ఈషాన్ రెడ్డి, యాదయ్య లాంటి యువ విద్యార్థులు తమ ప్రాణాలను అర్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. వేలాదిమంది విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో ఉంటూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. కానీ నాటి రాజకీయ పార్టీల నాయకులు నీళ్లు, నిధులు, నియామకాలనే నినాదాన్ని, తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షను ఆయుధంగా మార్చుకుని పదేళ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించారని అన్నారు. నిరుద్యోగ సమస్యను పట్టించుకోలేదని ఆరోపించారు. గత పాలనలో వారి కుటుంబ సభ్యులు, బంధు వర్గాన్ని శ్రీమంతులుగా చేయడం కోసమే పదేళ్ల పరిపాలన సాగిందని అన్నారు. ప్రజల గురించి ఆలోచించి ఉంటే కాళేశ్వరం కూలేశ్వరం అయి ఉండేది కాదని అన్నారు. లక్ష కోట్ల రూపాయలతో కట్టిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలిన ఘటన ప్రపంచంలో ఎక్కడా జరగలేదని అన్నారు. తన ఫామ్ హౌస్‌లో ఎకరా పంటపై రూ. 1 కోటి ఆదాయం వస్తుందని ఒక పెద్దాయన చెప్పారని అన్నారు. ఎకరాకు కోటి ఆదాయం వచ్చే విద్యను, యువత, ప్రజలకు ఎందుకు నేర్పించలేదని ప్రశ్నించారు

## పాకిస్థాన్ భూభాగమంతా మా రేంజ్‌లోనే ఉంది

సామర్థ్యాలు అర్థమయ్యాయని చెప్పుకొచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈ నూతన ఇంటిగ్రేషన్, టెస్ట్ ఫెసిలిటీలో మిస్సైల్ కనెక్షన్, టెస్ట్, క్వాలిటీ కంట్రోల్‌లకు అవసరమైన అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఈ ఏడాది మే 11న ఈ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ యూనిట్ నుంచి విజయవంతంగా క్షిపణులను ఉత్పత్తి చేయడం ద్వారా కీలక మైలురాయిని చేరుకుంది భారత్. ఇక్కడి బ్రహ్మోస్ బృందం ఒక నెలలోనే రెండు దేశాలతో రూ.4 వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకుంది. రానున్న రోజుల్లో ఇతర దేశాల నుంచి నిపుణులు లక్నోకు తరలివస్తారని, అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ యూనిట్ టర్నోవర్ రూ.3 వేల కోట్లు అవుతుందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ప్రతి ఏటా రూ.5 వేల కోట్ల మేర జీఎస్టీ వసూలు అవుతుందని తెలిపారు.

## జగన్ కుట్రలను తిప్పికొట్టాలి

ఆయన నేతలకు ఉద్బోధించారు.

ఇదే సమావేశంలో మాజీ మంత్రి జోగి రమేశ్ పై నమోదైన మద్యం కుంభకోణం కేసు ప్రస్తావనకు వచ్చింది. ఆయనను ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదని కొందరు సీనియర్ నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, మద్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగుతోందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టత ఇచ్చారు. దర్యాప్తులో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండదని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమం కావడంపై నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత పెద్ద ప్రాజెక్టును తీసుకువచ్చినందుకు వారు ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వర్ల రామయ్య సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంత్ కిశోర్ పార్టీ గురించి ఎన్నికల తర్వాత మాట్లాడుకుందాం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీ గురించి ఎన్నికల ఫలితాల అనంతరం మాట్లాడుకుందామని కేంద్ర మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, బీహార్‌లో ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు ఓటమి భయం పట్టుకుందని, వారి కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారో, ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారో వారికే తెలియదని ఎద్దేవా చేశారు. మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి బీహార్‌లో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కిడ్నాప్‌లు, కుల ఘర్షణలకు తెరపడిందని అమిత్ షా అన్నారు. గత పాలనలో బీహార్‌లో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, గత ఇరవై ఏళ్ల కాలంలో దానిని పూడ్చామని తెలిపారు. ఇప్పుడు బలమైన పునాదులపై నిర్మాణాలు చేపడతామని ఆయన అన్నారు. కొత్త ముసుగు ధరించి ఆటవిక రాజ్యాన్ని తిరిగి తీసుకురావాలని ఆశిస్తున్న వారిని ఓటర్లు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బీహార్‌లో పరిశ్రమలకు సరిపడే భూములు లేకపోవచ్చని, కానీ నాణ్యమైన శ్రామిక శక్తి ఉందని అన్నారు. రాష్ట్రాన్ని ఏఐ హబ్‌గా మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

## ఆర్థిక వెసులుబాటు వస్తే పీఆర్సీ కూడా ఇస్తాం

అమరావతి (ప్రశ్న న్యూస్)"రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది, గూడుపుఠాణీలకు తావులేదు. గత పాలకులు చేసిన అప్పులు, అనుత్పాదక వ్యయం రాష్ట్రాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెట్టేందుకు ఉద్యోగులు ప్రభుత్వంతో కలిసి రావాలి. ఆర్థిక వెసులుబాటు రాగానే తప్పకుండా పీఆర్సీ ఇస్తాం, దీనికి కొంత సమయం పడుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగ సంఘాలను కోరారు. దీపావళి పండుగ సందర్భంగా ఉద్యోగులకు ఒక మంచి వార్త చెప్పాలనే ఉద్దేశంతోనే వారితో సమావేశమైనట్లు ఆయన తెలిపారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీఎన్జీవో, ఏపీ జేఏసీ అమరావతి, సచివాలయ ఉద్యోగ సంఘం సహా పలు ఉపాధ్యాయ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తి స్పష్టత ఇచ్చారు.

రాష్ట్ర మొత్తం వ్యయంలో 91 శాతం, అంటే రూ.51,452 కోట్లు కేవలం ఉద్యోగుల జీతభత్యాలకే వెళ్తోందని సీఎం వివరించారు. "గత ఐదేళ్లలో పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ (38%), తమిళనాడు (42%), కర్ణాటక (39%) తమ వ్యయాన్ని తగ్గించుకుంటే, మన రాష్ట్రంలో మాత్రం భవిష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు చేశారు. ఈ విధ్వంసాన్ని సరిదిద్దేందుకే ప్రజలు కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అఖండ విజయాన్ని అందించారు," అని చంద్రబాబు అన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన సీపీఎస్ రద్దు అంశంపై కూడా ఆయన స్పందించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు తీర్పు ఉందని, దానిని పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఒక కేబినెట్ సబ్ కమిటీ ఉందని, ఎప్పటికప్పుడు సమస్యలను చర్చించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి ఉద్యోగులే ప్రధాన రథచక్రాలని, వారు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని సీఎం పేర్కొన్నారు. "ప్రభుత్వం పాలసీలను తీసుకొస్తుంది, కానీ వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సింది ఉద్యోగులే. సంపద సృష్టిస్తేనే సంక్షేమం సాధ్యమవుతుంది. గూగుల్ వంటి దిగ్గజ సంస్థ విశాఖకు రావడం సుపరిపాలన వల్లే సాధ్యమైంది. అందరం కలిసి 'ప్రభుత్వం మనది' అనే భావనతో పనిచేసి, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధిలో నంబర్ వన్‌గా నిలుపుదాం" అని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ, ఆప్కాస్ ఉద్యోగులను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులందరికీ ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొత్త టీచర్స్ ఫెడరేషన్ ఏర్పాటు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల చెల్లింపు నుంచి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వరకు పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొత్తగా ఆవిర్భవించిన 'తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్' ప్రారంభోత్సవం ఈ వ్యాఖ్యలకు వేదికైంది. శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో పలువురు ఉపాధ్యాయులతో కలిసి కవిత ఈ కొత్త ఫెడరేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు తక్షణమే పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లకు ఇప్పటికీ హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా రిటైర్డ్ ఉద్యోగులకు ప్రయోజనాలు అందకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు నిలిచిపోయాయని, దీపావళి లోపు వాటిని చెల్లించాలని కవిత ప్రభుత్వాన్ని కోరారు. సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని పాటిస్తూ, కేజీబీవీ టీచర్ల జీతాలను పెంచాలని సూచించారు. అదేవిధంగా, గురుకుల టీచర్లపై హాస్టల్ డ్యూటీల భారం వేయకుండా, ప్రత్యేకంగా వార్డెన్లు, కేర్‌టేకర్లను నియమించాలని అన్నారు. న్యూ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. ఒలింపిక్ పతకాల గురించి మాట్లాడే ముందు, పాఠశాలల్లో కనీసం పీఈటీ టీచర్లు లేరన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కవిత చురక అంటించారు. పీఈటీలు లేకుండా క్రీడల్లో పతకాలు ఎలా సాధ్యమని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీచర్లు కీలక పాత్ర పోషించారని, కోటి బతుకమ్మ జాతరను విజయవంతం చేశారని గుర్తుచేశారు. తెలంగాణ భావజాల వ్యాప్తిలో ప్రొఫెసర్ జయశంకర్ అందరికీ గురువని, ఆయనే తనకు అత్యంత ఇష్టమైన ఉపాధ్యాయుడని పేర్కొన్నారు. పాత సంఘాలతో కలిసి టీజేటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 19 అక్టోబర్2025

## మహిళల ఆర్థిక చైతన్యమే అభివృద్ధికి పునాది

.మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి: డి నాగేశ్వర్ రావు




మెట్ పల్లి (ప్రశ్న న్యూస్)"మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులవుతేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుంది" అని జగిత్యాల జిల్లా, మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి మెప్మా భవనంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కానీ ఆర్థిక విషయాలపై అవగాహన పెంపొందించుకోవడం అత్యవసరం.ఇన్స్యూరెన్స్, బ్యాంకింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. తీసుకున్న రుణాలను నిజమైన వ్యాపారాలకు వినియోగిస్తేనే పేదరికం నుంచి బయటపడగలరు" అని సూచించారు.ఈ కార్యక్రమానికి ముందు న్యాయమూర్తులు వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఏజీపీ అబ్దుల్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ తోగిటి మోహన్, సీఐ వి. అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, టీఎంసీ సోమిడి శివ, మేనేజర్ వెంకటలక్ష్మి, ఆర్పో మీర్జా అహ్మదుల్లా బేగ్, సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, బార్ అసోసియేషన్ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్పీలు పాల్గొన్నారు.

## మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో ఛాంపియన్ గా యూనివర్సల్ విద్యాలయం .



తల్లాడ, అక్టోబర్ 18 (ప్రశ్నన్యూస్): గత మూడు రోజుల నుండి డాన్ బాస్కో పాఠశాలలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలో అత్యధిక పథకాలతో మండల ఛాంపియన్ గా యూనివర్సల్ విద్యాలయం నిలిచినది. బాలుర విభాగంలోని సీనియర్ బాయ్స్ ఖో -ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలో మొదటి బహుమతిలు, సీనియర్ బాలికల విభాగంలో ఖో -ఖో లో ఫస్ట్ స్థానంలో నిలిచి, కబడ్డీ, వాలీబాల్ లో రన్నర్ గా నిలిచారు.జూనియర్ బాయ్స్ ఖో-ఖో రన్నర్స్. జూనియర్స్ గర్ల్స్ ఖో -ఖో మొదటి బహుమతి, వాలీబాల్, కబడ్డీ రెండవ బహుమతులను సాధించారు. అలాగే అథ్లెటిక్స్ విభాగంలో సీనియర్ 800 మీటర్స్,షాటపుట్, లాంగ్ జంప్ లో పి సాయిచరణ్ కి రెండోబహుమతి లభించింది. సీనియర్ గర్ల్స్ లాంగ్ జంప్, 100 మీటర్స్ యన్. భార్గవి రెండోబహుమతి, సీనియర్ షాట్పుట్ నందు వి. నందిని రెండవ బహుమతి, జూనియర్ గర్ల్స్ లాంగ్ జంప్ నందు బి. వేదవతి రెండవ బహుమతి, షార్ట్ పుట్ నందు ఎస్.కె ఆఫ్రిన్ రెండో బహుమతి సాధించింది. విజయం సాధించిన విద్యార్థులను పి ఇ టి నాగేశ్వర్ రావు, టీం మేనేజర్ మోహన్, కరెస్పాండంట్ ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఉపాధ్యాయులు అభినందించారు.


## డిజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాజేశం సీనియర్ పాత్రికేయుని ఎన్నికపై మంథని పాత్రికేయులు హర్షం



మంథని( ప్రశ్న న్యూస్)మంథనిలో సంచలన వార్తలు రాస్తున్న సీనియర్ పాత్రికేయులు దాసరి రాజేశం డీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శుభ సందర్భంగా మంథని పాత్రికేయులు రాజేశం కు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ పాత్రికేయులుగా రాజేశం ఎన్నో ప్రజోపకరమైన కథనాలు రాస్తూ మంచి పాత్రికేయులుగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. వివాద రహితుడుగా పేరు ఉన్న రాజేశం ఎందరో పాత్రికేయులకు మార్గదర్శకులని వారు గుర్తు చేశారు. రాజేశం ముందు ముందు మరి ఎంతో పైకి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

## బిసి బంద్ విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు

### తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షులు రామస్వామి ముదిరాజ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన బీసీ బంద్ విజయవంత కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రామస్వామి ముదిరాజ్ తెలిపారు. ఆర్టీసీ తో పాటు ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలు, వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బందులో పాల్గొనడం హర్షనీయమని రామస్వామి ముదిరాజ్ పేర్కొన్నారు. మేమెంతో మాకు అంత అనే నినాదంతో తలపెట్టిన బంద్ విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. కార్మికులు కర్షకులు వ్యాపారస్తులు ప్రతి ఒకరు రోడ్లపైకి వచ్చి బందులో పాల్గొనడం అభినందనీయం అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు , సబ్బండ వర్గాలు తెలంగాణ బంద్ లో పాల్గొనడం అభినందనీయమన్నారు. బీసీలు 42 శాతం సాధించేవరకు ఈ పోరాటం ఆగదని రామస్వామి ముదిరాజ్ తెలిపారు. దీంతోపాటు బీసీ రిజర్వేషన్ కోసం చట్టసభలో బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పోరాడుతుందని తెలిపారు

# అభాగ్యురాలిని ఆశ్రమంలో చేర్పించిన సిఐ, రిపోర్టర్






-ఎవరూ లేని అభాగ్యులను వృద్ధాశ్రమంలో చేర్పించడానికి కృషి చేయండి

-చలికాలం చలిని, ఆకలిని తట్టుకోలేని వృద్ధుల పట్ల మానవత్వం చూపండి

యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట పట్టణంలోని అండర్పాస్ కింద ఒక అభాగ్యురాలి దీనస్థితిని గమనించిన యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల గిరిబాబు ఈ విషయాన్ని యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన సీఐ భాస్కర్ వెంటనే అక్కడకు చేరుకొని తగిన విధంగా సహాయం చేయడం ఆ తర్వాత ఆమెను వృద్ధ ఆశ్రమంలో చేర్పించారు.ఈ వ్యవహారంలో యాదగిరిగుట్ట ప్రింటు మీడియా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల గిరిబాబు మానవతా దృక్పథంతో వ్యవహరించడం పై స్థానికులు అభినందించారు. బీర్ల ఫౌండేషన్ వారికి విషయం తెలియజేయడంతో ఒక అభాగ్యురాలికి తగిన విధంగా సహాయం చేశారు. ఒక అభాగ్యురాలి ని అత్యంత దీనస్థితి నుండి మెరుగైన స్థితికి తీసుకువచ్చేలా కృషిచేసిన వారిని అభినందించాలని అలాగే ఇలా రోడ్లపై చాలామంది అభాగ్యులు చలికి తట్టుకోలేక విగత జీవులుగా మారుతున్నారు కాబట్టి స్థానికంగా ఉన్న పోలీసులు మీడియా సిబ్బంది ఏకమై వారిని వృద్ధాశ్రమంలో తరలింపుకు ప్రత్యేక చొరవ కోరుకుందాం.



## భారతీయ యువ సేవా సంఘ్ - సౌత్ ఇండియా జోనల్ కో-ఆర్డినేటర్ గా బి.జె.ఎం.ఎస్ ఏ.పీ రాష్ట్ర అధ్యక్షుడు నాలి.మధుసూదన్ యాదవ్

గూడూరు (ప్రశ్న న్యూస్)భారతీయ యువ సేవా సంఘ్ జాతీయ కోర్ కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా, గూడూరు పట్టణానికి చెందిన భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నాలి మధుసూదన్ యాదవ్ ని భారతీయ యువ సేవా సంఘ్, దక్షిణ భారతదేశం జోనల్ కో-ఆర్డినేటర్ గా నియమించడం. జరిగింది. ఈ పదవి బాధ్యతలను భారతీయ యువ సేవా సంఘ్ లో యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు మరియు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల ఇంచార్జ్ మద్దిశెట్టి సామేలు చేతులు మీదుగా నియామక పత్రాన్ని అందుకుని పదవి బాధ్యతలను స్వీకరించడం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ బి.జే.ఎమ్.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నాలి మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ.. భారతీయ యువ సేవా సంఘ్, దక్షిణ భారతదేశం జోనల్ కో-ఆర్డినేటర్ గా నన్ను నియమించిన, సహకరించిన



జాతీయ కమిటీ మరియు రాష్ట్ర కమిటీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా బాధ్యతను చేపట్టిన నేను భారతీయ యువ సేవా సంఘ్ ని దక్షిణ భారతదేశంలోని 6 రాష్ట్రాలలో బలోపేతం చేయడం కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు. అదే క్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఎం.ఎస్.ఎం.ఈ మరియు మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పదవి బాధ్యతలను స్వీకరించానని తెలిపారు. అదేవిధంగా నాకు ఈ పదవి బాధ్యతలు రావడానికి సహకరించిన భారతీయ యువ సేవా సంఘ్ జాతీయ వ్యవస్థాపకులు భరణి బాలకృష్ణాజి , జాతీయ అధ్యక్షులు రోషన్ గుప్తా, జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌరబ్ దాస్ జి, జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎస్ షవర్, లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.జె.ఎం.ఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు మరియు బి జె ఎం ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా కలప అక్రమ రవాణా..!!







- పట్టింపులేని అధికారులు.. పట్టించిన గ్రామస్తులు..
- అధికారులే స్మగ్లర్లకు సహకారాన్ని అందిస్తున్నారనే ఆరోపణలు..
- నామమాత్రపు కేసులతో చేతులుదులుపుకుంటున్న ఫారెస్ట్ సిబ్బంది..

జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 18: మండలంలో కలప అక్రమంగా తరలిస్తూ వ్యాపారస్తులు లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వ భూములల్లో, అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరకడమే వీరి లక్ష్యం. జూలూరుపాడు మండలంలో కొందరు కలప వ్యాపారుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని గుండెపుడి. బీట్ లోని జామాయిల్ ప్లాంటేషన్లో ఏపుగా పెరుగుతున్న జామాయిల్ చెట్లను కొందరు ఫారెస్ట్ అధికారుల సహకారంతో కలప స్మగ్లర్లు అర్ధరాత్రుల్లో చెట్లను నరికి రవాణా జరుపుతున్నట్టు చుట్టుపక్కల గ్రామాలలో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో జామాయిల్ కర్రను తీసుకువెళ్తుండగా గ్రామస్తులు గుర్తించారు.

విషయం అందరికీ తెలియడంతో నరికిన జామాయిల్ కర్ర సుమారు (150) కర్రలను అనంతారం గ్రామంలోని ఓ రైతుకు చెందిన పామాయిల్ తోటలో దాచిపెట్టారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ రేంజ్ అధికారిని నాసర్ బీ పామాయిల్ తోట వద్దకు వెళ్లి దాచిన కర్రను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సదరు అధికారిని ప్లాంటేషన్ వద్దకు వెళ్లి నరికిన చెట్లను కొలిచి లెక్కించారు.

**- అధికారులే స్మగ్లర్లకు సహకారాన్ని అందిస్తున్నారనే ఆరోపణలు..!**

మండలంలో యథేచ్ఛగా కలప, అక్రమ తరలింపు జరుగుతున్న కూడా అటవీ అధికారులు ఇప్పటివరకు మండలం లో తనిఖీలు చేసి కలపని పట్టుకున్న దాఖలాలు అయితే లేవు. తనిఖీలు చేపట్టకపోవడం పై అటవీ అధికారులపై అనుమానాలు మండలం లో తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. అక్రమ కలప తరలింపుల విషయం అటవీ అధికారులు లంచాలు తీసుకుని వీరి కనుసన్నల్లోనే అక్రమ తరలింపు జరుగుతుందనే విమర్శలు వచ్చిపడుతున్నాయి. అటవీశాఖ అధికారులు మామూళ్లు వసూలు చేస్తు కలపను అక్రమంగా తరలించడంలో పాత్ర వహిస్తున్నారని వ్యాపారులే బహిరంగంగా చెబుతున్నారు. చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేనిపక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేసి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని అంటున్నారని వారు వాపోయారు. అటవీ అధికారులు నిర్లక్ష్యం వీడి మండలంలో అక్రమ కలప రవాణాలపై తనిఖీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.


**- నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్న ఫారెస్ట్ సిబ్బంది..!!**

జామాయిల్ ప్లాంటేషన్లో గత కొంతకాలంగా చెట్లను నరికి అక్రమ కలప రవాణా ఫారెస్ట్ అధికారులకు తెలిసే జరుగుతుందని చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఫారెస్ట్ సిబ్బందికి తెలియపరచినా పట్టింపు లేకుండా వ్యవహరించడంతోనే అక్రమ కలప రవాణా వ్యవహారాన్ని గ్రామస్తులు బట్టబయలు చేసి అనంతారంలో అక్రమ కలప నిల్వలను ఫారెస్ట్ సిబ్బందికి తెలియపరచడంతో డిఆర్ఓ అధికారిని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగింది, ఇదంతా ఒక ఎత్తైతే. గత కొంతకాలంగా అక్రమ రవాణా జరుపుటలో మూల కారణం ఎవరు ఫారెస్ట్ సిబ్బంది పాత్ర ఉందా? లేదా? అనే కోణంలో విచారణ జరపకుండా నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకోవడం బాధాకరమని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# త్రుటిలో తప్పిన ప్రమాదం..!

## - చప్టాలో ఇరుక్కుపోయిన ఇసుక ట్రాక్టర్..

జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 18: జూలూరుపాడు మండలపరిధిలోని మాచినేనిపేట, వాగొడ్డు తండా గ్రామాల మధ్య ఎర్రవాగుపై త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇసుక లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్. ఇసుక లోడుతో వెళుతుండగా ఒక్కసారిగా చప్టా కుంగిపోవడంతో కాంక్రిట్ ముక్కలై ట్రాక్టర్ ట్రాక్కు ఇరుక్కుపోయింది ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం సంభవించిన సమయంలో



చప్టా సమీపంలో ద్విచక్ర వాహనాలు గాని ప్రజలు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో ట్రాక్టర్ బయటకు తీశారు. నాసిరకం పనులతో ఈ చప్టా నిర్మించడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
ఆదివారం 19 అక్టోబర్2025

## గూగుల్ సెంటర్ పేద విద్యార్థులకు గొప్ప వరం

### ఏపీ గిరిజన సలహా మండలి సభ్యులు సుబ్బయ్య



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో హైటెక్ సిటీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్థాపించి పేద విద్యార్థులకు విదేశాలకు పోకుండా మనదేశంలోనే అంటే ఆనాడు మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే బ్రహ్మాండంగా ఉద్యోగాలు ఐటి రంగాల్లో చేసుకోవడం జరిగింది. మరి ఈరోజు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా తన తనయుడు ఐటి శాఖామంత్రి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రోత్సాహంతో ప్రోద్బలంతో ఈరోజు విశాఖపట్నంలోనే అతిపెద్ద గూగుల్ సెంటర్ ను ఏర్పాటు చేయుటకు ఢిల్లీలో గూగుల్ యాజమాన్యంతో మాట్లాడి గూగుల్ సెంటర్ పెట్టుటకు సన్నాహాలు చేయడం జరిగినది మరి దీనివల్ల 1,33 వేల ఉద్యోగాలు పేద విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు తెలియపరచడం జరిగినది మరి ఆరోజు తండ్రి హైటెక్ సిటీ తెస్తే మరి ఈరోజు తనయుడు లోకేష్ బాబు గూగుల్ సెంటర్ ను తేవడం జరిగింది మరి పేద విద్యార్థులందరూ లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది రానున్న రోజుల్లో యువత భవిష్యత్తుకు మంచి బాట వేసేది తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమిఅని విద్యార్థులందరూ కొనియాడారు.

## నారాయణ చెరువును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని నారాయణ చెరువు ప్రాంతాన్ని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా నారాయణ చెరువు ఎంపికైనందున ఎంపికైనందున చెరువు అభివృద్ధికి సంబంధించిన విషయాల పైన చర్చించేందుకు నారాయణ చెరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ వెంకట గోపాల్ తో పాటు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు ఎస్ ఇ వెంకటేశ్వర్లు, ఇ ఇ ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ ఇ ఇ దుర్గాప్రసాద్, మేనేజర్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సిపిఎం రాస్తారోకో



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర గవర్నర్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీసీ సంఘాలు వామపక్షా పార్టీలు, వివిధ రాజకీయ పార్టీలు తెలంగాణ రాష్ట్ర బంద్ సందర్భంగా సిపిఎం, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేషనల్ హైవే పై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ. అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ 42 శాతం బిసి బిల్లుకు ఆమోదం తెలపకుండా, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు బీజేపీ కూడా మద్దతు ఇవ్వడం విడ్డురంగా ఉందన్నా రు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర బీజేపీ ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా చేసి బంద్ విజయవంతం అయిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసిందన్నారు, అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని వివరించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆమోదించలేదని బీసీ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. బిల్లును ఆమోదించాల్సినటువంటి కేంద్ర ప్రభుత్వం ఈ బంద్ లో పాల్గొనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం పార్టీ పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు అరుణ్ యాదవ్, సిపిఎం పార్టీ మేడ్చల్ మండల నాయకులు నర్సింగరావ్, ప్రశాంత్, కొమురయ్య,, నర్సింగ్ రావ్, పూజ, ఎన్ కృష్ణ, శ్రీనివాస్, కృష్ణ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్ లో కనిపించని మేడ్చల్ బిఆర్ఎస్ నేతలు




మేడ్చల్( ప్రశ్న న్యూస్) బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన తెలంగాణ బందులో మేడ్చల్ బిఆర్ఎస్ నేతలు ఎక్కడ కనిపించలేదు. బీసీ బందుకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించిన మేడ్చల్ బిఆర్ఎస్ నేతలు ఎక్కడ కనిపించకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర పార్టీ నేతలు మేడ్చల్ లో బీసీ హక్కుల కోసం పోరాడుతుంటే బిఆర్ఎస్ బీసీ నేతలు మాత్రం జూబ్లీహిల్స్ లో ఎన్నికల ప్రచారం చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బీసీ ల హక్కులపై గొప్ప గా మాట్లాడే బిఆర్ఎస్ నేతలు బీసీల కోసం పోరాడుతుంటే ఎక్కడ ఉన్నారు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదేనా బీసీలపై ఉన్న ప్రేమ అంటూ నిలదీస్తున్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో బిఆర్ఎస్ కు బీసీల ఓట్లు అక్కర్లేదంటూ ప్రశ్నిస్తున్నారు.

# దీపావళి సంబరాలు

మేడ్చల్ (ప్రశ్నన్యూస్)ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకునే దీపావళి, అంధకారంపై వెలుగు, చెడుపై మేలుని ప్రతీకగా దేశమంతటా ఘనంగా జరుపుకుంటున్నారు. ఇళ్లన్నీ వెలుగులతో, రంగుల రంగోలీలతో, మిఠాయిల సువాసనలతో నిండిపోతున్నాయి.

**పండుగ ప్రత్యేకత..**

దీపావళి హిందువులకే కాకుండా ప్రతి మతానికీ ఆనందాన్ని పంచే పండుగగా మారింది. శ్రీరాముడు రాక్షసరాజు రావణుడిని జయించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతించిన రోజు అనే పురాణ ప్రాముఖ్యత ఉంది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఈ పండుగను "వెలుగుల పండుగ"గా జరుపుకుంటున్నారు.

**మార్కెట్లలో హడావిడి..**

దీపావళి దగ్గరపడడంతో మార్కెట్లు సందడిగా మారాయి. బంగారు ఆభరణాలు, దుస్తులు, గిఫ్ట్ హ్యాంపర్లు, స్వీట్లు కొనుగోళ్లతో వ్యాపారులు సంతోషంగా ఉన్నారు. చిన్నారులు కొత్త బట్టలు, పటాకులు కొనే ఆనందంలో తల్లిదండ్రులతో షాపింగ్ చేస్తున్నారు.

**చాలా జాగ్రత్త..**

దీపావళి పండుగ సందడిలో పటాకులు కాల్చడం ఆనందాన్నిస్తుందే కానీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే



ప్రమాదాలకు దారి తీస్తుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ కొన్ని మూల జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరం అని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే పటాకులు కాల్చాలి..**

పటాకులు తెరవెనుక ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలి %– ఇళ్ల మధ్య, చెట్ల కింద లేదా విద్యుత్ వైర్ల దగ్గర కాదు.

సింథటిక్ దుస్తులు కాకుండా కాటన్ బట్టలు ధరించాలి. అవి అగ్ని తగలకుండా కాపాడుతుంది

పటాకులు చెడిపోతే వాటిని తిరిగి వెలిగించకూడదు ( పక్కన పడేయాలి.

పశువులు, వృద్ధులు, చిన్నారులు ఉన్న ప్రదేశాల్లో శబ్దపటాకులు దూరంగా ఉంచాలి.



కాలిన గాయాలు అయితే వెంటనే చల్లని నీరు పోసి వైద్యుడిని సంప్రదించాలి.

**పోలీసుల సూచనలు..**

దీపాలు, పటాకులు వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, చిన్న పిల్లలను పెద్దల పర్యవేక్షణలో ఉంచాలని అధికారులు సూచించారు.వెలుగులు, ఆనందం, ప్రేమ, శాంతి నింపే దీపావళి పండుగలో ప్రతి ఇంటా వెలుగు ప్రసరించాలని, ప్రతి మనసులో సానుకూలత కలగాలని అందరూ కోరుకుంటున్నారు."అంధకారం తొలగించి వెలుగు నింపే దీపం... ప్రతి మనసులో మానవత్వం వెలిగించాలి"

**"దీపావళి శుభాకాంక్షలు "ప్రజాప్రశ్న "ప్రత్యేక కథనం... మేడ్చల్ ప్రతినిధి చిన్న**

## మేడ్చల్ ఆర్టీసీ కార్మికుల స్వచ్ఛందంగా బంద్

### మేడ్చల్ ఆర్టీసీ కార్మికుల స్వచ్ఛందంగా బంద్

### ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

### డిపో నుండి బయటకు రాని బస్సులు

### క్యాబ్ ల హవా

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) బీసీ బంద్ లో భాగంగా మేడ్చల్ ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా బందును పాటించారు. ఉదయం నుండి ఒక్క బస్సు డిపో నుండి బయటకు రాలేదు. దీంతో బస్సులన్నీ డిపోలో ఉండిపోయాయి. మేడ్చల్ లో ఆర్టీసీ బస్సులు నడవకపోవడం వల్ల రోడ్లన్నీ నిర్మానుషంగా మారాయి. బందు అని విషయం తెలుసుకున్న ప్రయాణికులు బస్టాండ్ కు రాకపోవడంతో ప్రయాణికులు లేక బస్టాండ్ అంతా బోసిపోయింది. బస్సు డ్రైవర్లు కండక్టర్లు చెట్ల కింద బస్సులలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థలు ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండు చేశారు. అనంతరం మధ్యాహ్నం మూడు తర్వాత బస్సులు యధావిధిగా నడిచాయి.

**క్యాబ్ లు, ఆటోల హవా**



ఆర్టీసీ బస్సులు,బీసీ బందులో స్వచ్ఛందంగా పాల్గొనడం వల్ల బస్సులన్ని డిపోకే పరిమితం కావడంతో క్యాబ్ లు, ఆటోల పంట పండింది. ఇదివరకు ఉన్న చార్జీల కన్నా అదనంగా రెట్టింపు చార్జీలను వసూలు చేశారు. ఉదాహరణకు ఉప్పల్ నుండి హనుమకొండ కు వెళ్లాలంటే ఇదివరకు 350 రూపాయలు తీసుకునే క్యాబ్ లు బంద్ సందర్భంగా క్యాబ్ లు 700 రూపాయలు వరకు ప్రయాణికుల వద్ద నుండి వసూలు చేసినట్టు తెలుస్తుంది.

# మేడ్చల్ లో బీసీ బంద్ సక్సెస్

### స్వచ్ఛంగా బందును పాటించిన ఆర్టీసీ

### దుకాణాలను చిరు వ్యాపారాలను ముగించి వేసిన కాంగ్రెస్ నేతలు

### రాస్తారోకోలు : నిలిచిపోయిన వాహనాలు

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మున్సిపల్ పరిధిలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆర్టీసీ స్వచ్ఛంగా బంద్ పాటించింది. ఉదయం నుండే బస్సుల రాకపోకలు బంద్ అయ్యాయి. బస్సులన్నీ డిపోలో నిలిచిపోయాయి. దీంతో రోడ్లన్నీ నిర్మానుషంగా కనిపించాయి. ఆర్టీసీ బస్సులు నడవకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు

**దుకాణాలను మూయించిన కాంగ్రెస్ నేతలు**

బీసీ బందుకు మద్దతు తెలుపుతూ దుబ్బ రామస్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని విద్యాసంస్థలు దుకాణాలను చిరు వ్యాపారాలను ముగించి బంద్ కు మద్దతు తెలపాలని కోరారు. మేడ్చల్ పట్టణంలో కలియ తిరుగుతూ తెరిచి ఉంచిన దుకాణాలను మూయించి వేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు



వేసి నివాళులర్పించారు. బీసీలు బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. అంతకుముందు మేడ్చల్ బస్ డిపోలో కాంగ్రెస్ నేతలు ఆందోళన చేశారు. రాజకీయ రంగాలలో బీసీలకు అవకాశాలు పెరగాలనేది మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ నినాదం అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు మాజీ వైస్ చైర్మన్ చీరల రమేష్, పార్టీ మండల ప్రెసిడెంట్ రమణారెడ్డి మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ మాజీ కౌన్సిలర్ శాప రాజు మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగురాజు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మల్లేష్ గౌడ్, కౌడే మహేష్ చాపరాజ మధుకర్ యాదవ్ పోచయ్య ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి బాల్ మహేష్ సంజీవరావు సద్ది సంజీవరెడ్డి శ్రీకాంత్ సత్తి ఆంజనేయులు రామస్వామి యూత్ కాంగ్రెస్ నేతలు రంజిత్ ముదిరాజ్ఎన్ ఎస్ ఐ అధ్యక్షుడు రాకేష్ నాగరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

**రాస్తారోకో**

సిపిఎం బీసీ సేన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మేడ్చల్ లో రాస్తారోకో నిర్వహించారు. సిపిఎం, బీసీ సేన విద్యార్థి విభాగం నేతలు మేడ్చల్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి. చివరకు పోలీసులు రాస్తారోకో చేస్తున్న నేతలకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింప చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మేడ్చల్ మండల కార్యదర్శి, ఎం నరేష్, బీసీ సేన విద్యార్థి విభాగం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ పోలీసుల అరెస్టులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పై హైకోర్టు స్టే ఇవ్వడాని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎర్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో బీసీ బంద్ విజయవంతం



### భారీగా పాల్గొన్న బిసి విద్యార్థి సంఘాల నాయకులు

ఓయూ (ప్రశ్న న్యూస్) ఓయూ లో బిసి బంద్ లో పాల్గొన్న బిసి విద్యార్థి నాయకులు బిసిలకు విద్యలో, ఉద్యోగలలో, స్థానిక సంస్థలు ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చి విద్య,ఉద్యోగ, స్థానిక సంస్థ ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ముందు కేంద్ర ప్రభుత్వం యొక్క దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.



అదేవిధంగా ఉస్మానియా యూనివర్సిటీలోని అన్ని కాలేజీలను, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగును, ఎగ్జామినేషన్ బ్రాంచ్ ను, శివం రోడ్డు సర్కిల్లో, తార్నాక నుండి హబ్సిగూడ వరకు విద్యా సంస్థలను, వ్యాపార సంస్థలను బందు చేయించారు. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి స్వామి గౌడ్, వట్టికుటి రామారావు గౌడ్, దేశగాని సాంబ శివ గౌడ్, జంపాల రాజేష్, చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, నిజ్జన రమేష్ ముదిరాజ్, జగన్ ముదిరాజ్, నక్క శ్రీశైలం యాదవ్, రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, బైరు నాగరాజు గౌడ్, బాలు నేత, జంగయ్య,జక్కుల మధు,కాంపటి వెంకట్ గౌడ్, లక్ష్మి ఆంజనేయులు ముదిరాజ్, వెంకట్,కౌశిక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 19 అక్టోబర్2025

## డీపీఆర్ఓగా జెడ్పి డిప్యూటీ సిఈవో నరేష్

### కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు

### -బాధ్యతలు స్వీకరించిన నరేష్




జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లా డిపిఆర్ఓ గా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ నరేష్ నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ లో గల జిల్లా సమాచార, పౌరసంబంధాల కార్యాలయంలో శనివారం పల్లికొండ నరేష్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది శివాని, కవిత, కొండయ్య, పర్శరాం గౌడ్ తదితరులు అభినందించారు.

## ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు

### ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా

### -మంత్రి అడ్లూరికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, ధర్మపురి ప్రజలు



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Higher Education Department - Sanction of new Government Degree College at Dharmapuri, Jagtial District - Accorded - Orders - Issued.

HIGHER EDUCATION (CE) DEPARTMENT

G.O.Ms.No.38 Dated:18.10.2025
Read:-

From the Commissioner of Collegiate Education, Hyderabad, File No.CCE-GDCs/NGDC/16/2024-NGDC, dt:nil.

****

ORDER:

In the circumstances reported by the Commissioner of Collegiate Education, Hyderabad in the reference read above, and Government after careful examination of the matter hereby sanction new Government Degree College at Dharmapuri, Jagtial District.

2. The Commissioner of Collegiate Education, Hyderabad, shall take further necessary action, accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

Dr. YOGITA RANA
SECRETARY TO GOVERNMENT

To
The Commissioner of Collegiate Education, Hyderabad.
The Pay & Accounts Officer, Telangana, Hyderabad.
The Director of Treasuries and Accounts, Telangana, Hyderabad.
The Accountant General, Telangana State, Hyderabad.
Copy to:
The P.S to Secretary to Hon'ble Chief Minister.
The P.S to Principal Secretary to Govt., Finance Department.
The P.S to Secretary to Government (Education).
The Finance (EBS.IV) Department.
Sf/Sc.

//FORWARDED::BY ORDER//

SECTION OFFICER

జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లాకు చెందిన ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు అయినది. దీనికి సంబంధించి విద్యా శాఖ సెక్రటరీ యోగితా రాణా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కి విద్యార్థులు, ధర్మపురి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)ఈనెల 25 నుంచి తెలంగాణ జాగృతి జనం బాట యాత్ర నేపథ్యంలో తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బయల్దేరిన కవిత, భర్త అనిల్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారితో కలిసి శనివారం రాత్రి శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి తిరుపతి కి ప్రయాణం ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం హాథిరాం బావాజీ మఠాన్ని సందర్శించి బర్సి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేస్తారు. ఈనెల 21న యాదాద్రి శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

## తెలంగాణలో 150 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న ఏపీ మహిళ!

### ఏపీతో పాటు యుపీ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు కూడా టెండర్లు వేసిన వైనం

### శనివారం ఒక్కరోజే 30వేలకు పైగా దాఖలైన దరఖాస్తులు

### ఈ నెల 23న డ్రా ద్వారా మద్యం లైసెన్సుల కేటాయింపు

తెలంగాణ రాష్ట్రంలో 150 మద్యం దుకాణాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ దరఖాస్తు చేయడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగిసింది. చివరి రోజు కావడంతో టెండర్లు భారీగా దాఖలయ్యాయి. శనివారం ఒక్కరోజే 30 వేలకు పైగా దరఖాస్తులు అందగా, మొత్తం సంఖ్య 90 వేలు దాటినట్లు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో మొత్తం 2,620 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం గత నెల 27న టెండర్ నోటిఫికేషన్ విడుదలైంది. శనివారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల గడువు ముగిసింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఈ నెల 23న డ్రా ద్వారా లైసెన్సులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

అయితే, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ ఏకంగా 150 దుకాణాలకు దరఖాస్తు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆమె ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు కూడా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తు చేయడం విశేషంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది వ్యాపారులు, పెట్టుబడిదారులు, మహిళలు ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనడం రాష్ట్రంలో మద్యం దుకాణాలకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తోంది.

# బీసీలను రౌడీలాగా పోల్చుతూ మాట్లాడడం సిగ్గుచేటు



### బీసీ నేత లింగంగౌడ్

### జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ ను చూసి ఓటమిని ఖరారు చేసుకున్న బిఆర్ఎస్ పార్టీ

తార్నాక(ప్రశ్న న్యూస్)జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ (ఒక బలహీన వర్గాలకు చెందిన బిసి బిడ్డ) అవుతాడని జీర్ణించుకోలేక అతనిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అవాక్కులు చవాక్కులు పేలుతున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాల వద్ద లింగంగౌడ్ మాట్లాడుతూ నవీన్ యాదవ్ నామినేషన్ సందర్భంగా పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ఓర్వలేక నామినేషన్ కార్యక్రమంలో రౌడీలాగా కత్తులు తిపారని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా టికెట్ కన్ఫర్మ్ అయిన దగ్గర నుంచే ఓడిపోతారనే భయంతో ఏదో ఒక సందర్భంలో అభ్యర్థి మీద లేనిపోని ఆరోపణలు సృష్టిస్తున్నారన్నారు. నవీన్ యాదవ్ గెలుపుని ఎవరు ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో బూర తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు గుంటి మహేష్, ఓయు జేఏసీ నాయకులు రవీందర్, నిరంజన్ పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుంది

### బిజెపి నేత రమేష్ యాదవ్

### కేంద్రం నుంచి స్థానిక ఎన్నికల సంస్థల నిధులను దారి మళ్లించే ప్రయత్నంలో కాంగ్రెస్ పార్టీ

### బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

### కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చెప్పేది ఒకటి ప్రజలకు చేసేది మరొకటి



మల్కాజ్గిరి ప్రతినిధి (స్కై న్యూస్) కాప్రా, డాక్టర్ ఏ. ఎస్. రావు నగర్ డివిజన్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు చేయాలని బీసీ నాయకులు నిరసన కార్యక్రమము చేపట్టామని బీజేపీ నేత రమేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు 42% శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించాలని కోరుతూ, బీసీ జేఏసీ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర బందు, బంద్ ఫర్ జస్టిస్ పిలుపుకు మద్దతు పలికిన బిజెపి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి ఊరేగింపులు తీసి బందుకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తూ రోజుకి అభివృద్ధి కుంటూపడుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన గురవుతున్నారని ఆయన అన్నారు. హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం కే దక్కుతుందని ఇలాంటి ప్రభుత్వం ఏ ప్రజలకు ఏం చేస్తుందని హైదరాబాద్ లో పేద బడుగు బలహీన వర్గాల గూడు లేకుండా చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పకుండా చేతలు చేసి స్థానిక సంస్థలు ఎన్నికలు జరపాలని ఏదైతే ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మాట మీద నిలబడనట్లయితే బీసీలు పెద్ద ఎత్తున తిరగబడి స్థానిక సంస్థ ఎన్నికలలో బిజెపికి ఓటు వేసి బిజెపి బలాన్ని పెంచే ప్రయత్నం బిజెపి నేతలు చేస్తారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చేదాకా ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాట చెబుతూ కాలం గడుపుతున్నారు తప్ప ప్రజల అభివృద్ధి రోజుకి కుంటుపడుతుందని ప్రభుత్వ పథకాలు అందకుండా అందిన పథకాలు అంతంత మాత్రం అందుతున్నాయని పూర్తిస్థాయిలో అందడం లేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం పై నెట్టరాదని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానని హామీ ఇచ్చి బినామీల పేరుతో కేసు వేయించి అడ్డు పుల్ల వేసి స్థానిక సంస్థల ఎన్నికలను మరికొంత కాలం జరగకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన అన్నారు. కాప్రా, డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో ఉన్న వాణిజ్య సంస్థలు, బ్యాంకులు, హోటల్స్, పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బందును పాటించారని, మరియు సైనిక్ పూర్ లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేయడం జరిగిందని బీజేపీ నేత రమేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెరాస శివకుమార్, కిషోర్ చారి, తెరాస కుమారస్వామి, విద్యాసాగర్, గణేష్ ముదిరాజ్, తెరాస బేతాళ బాల్రాజ్, టి. కృష్ణారెడ్డి, రొయ్యలు చిత్తారి ముదిరాజ్, మచ్చ లక్ష్మణ్ గౌడ్, సహదేవ్ గౌడ్. మొదలైన బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపరులు బీజేపీలో చేరగానే వైట్ వాష్ ఎలా అవుతున్నారు? కేంద్రంపై సీఎం స్టాలిన్ ప్రశ్నాస్త్రాలు

: కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. అవినీతిపరులు బీజేపీలో చేరగానే కడిగిన ఆణిముత్యాల్లా వైట్ వాష్ ఎలా అవుతున్నారని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసుతో పాటు యావత్ దేశ ప్రజల మనసుల్లో ఇంకా చాలా ప్రశ్నలు మెదులుతున్నాయని స్టాలిన్ తెలిపారు. వాటిలో కొన్ని ప్రశ్నలను తాను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నానని చెప్పారు. బీజేపీ కూటమి అనే వాషింగ్ మెషీన్ అవినీతిపరులు, లంచగొండులను మరక లేని తెలుపు రంగులోకి ఎలా మారుస్తోందో చెప్పాలని మోదీ సర్కారును సీఎం నిలదీశారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులు, చట్టాలకు హిందీ, సంస్కృత భాషల్లోనే పేర్లు పెట్టే అహంకార భావాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎందుకు ప్రదర్శిస్తోందో క్లారిటీ ఇవ్వాలన్నారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా స్టాలిన్ ఒక పోస్ట్ పెట్టారు.



"కేంద్ర మంత్రులు దేశంలో మూఢనమ్మకాలను వ్యాపింపజేస్తూ పిల్లల ఆలోచనా శక్తికి అడ్డుకట్ట ఎందుకు వేస్తున్నారు? సైన్సుకు వ్యతిరేకంగా ఆ మంత్రుల వ్యవహార శైలి ఉంది. విపక్షపాలిత రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా భయాందోళనలను సృష్టించి రాజకీయ ప్రయోజనాన్ని పొందేందుకు కేంద్రం ఎందుకు యత్నిస్తోంది? ఇటీవలే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎందుకు నిర్వహించారు? ఓట్లను చోరీ చేసి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకే ఎస్ఐఆర్‌ను నిర్వహించారా? తమిళనాడులోని కీలడి, శివగలై వంటి పలు ప్రాచీన పట్టణాల్లో 5,300 ఏళ్ల క్రితమే ఇనుప వస్తువులను వినియోగించిన సాక్ష్యాలతో కూడిన 'కీలడి నివేదిక'ను గుర్తించడానికి కేంద్రం ఎందుకు సిద్ధంగా లేదు? కీలడి నివేదికను తొక్కిపెట్టేందుకు కేంద్రం ఎందుకు యత్నిస్తోంది? ఈ ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వం దగ్గర సమాధానాలు ఉన్నాయా? లేదంటే మునుపటిలాగే వాట్సాప్ యూనివర్సిటీ వేదికగా తప్పుడు ప్రచారానికి తెరతీస్తారా?" అని సీఎం స్టాలిన్ ప్రశ్నలను సంధించారు.

ఇటీవలే కేంద్ర సర్కారుపై తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు తీవ్ర ఆరోపణలు చేశారు. ధర్మబద్ధంగా తమిళనాడు రాష్ట్రానికి ఎన్ని నిధులు అందాలో, అన్ని నిధులను కేంద్రం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయ దురుద్దేశంతోనే తమిళనాడుకు కేంద్ర సర్కారు ఇలాంటి అన్యాయం చేస్తోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి తగినన్ని నిధులను సాధించేందుకు తన నిరసనలను కొనసాగిస్తానని తంగం తెన్నరసు తేల్చి చెప్పారు. విద్యాహక్కు అమలు కోసం తమిళనాడుకు రూ.4వేల కోట్లను కేటాయించాల్సి ఉండగా, రూ.450 కోట్లనే కేంద్రం ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి ప్రాజెక్టులను నిర్మించి నిర్వహిస్తుంటామని, దానికి నిధులు అందకపోవడంతో శుద్ధిచేసిన తాగునీటి పంపిణీ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్రంలోని జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఇంకా రూ.3,407 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తమిళనాడు ఆర్థిక మంత్రి వివరించారు.

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు 8 కొత్త ఎక్స్‌ప్రెస్ వేలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి రూ.50,655 కోట్లను వెచ్చించనున్నారు. అయితే వీటిలో ఒక్క ఎక్స్‌ప్రెస్ వేను కూడా తమిళనాడుకు మంజూరు చేయకపోవడం గమనార్హం. కొత్త ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టుల కేటాయింపులో ఉత్తర్‌ప్రదేశ్ (రూ.11,800 కోట్లు), గుజరాత్ (రూ.10,500 కోట్లు), మహారాష్ట్ర (రూ.17,800 కోట్లు) ప్రాధాన్యాన్ని పొందాయి. ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులోనూ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రమే ముందంజలో నిలిచింది. ఆ రాష్ట్రానికి ఒక్క ఏడాదిలోనే రూ.19,858 కోట్లను మంజూరు చేశారు. అయితే తమిళనాడులోని రైల్వే ప్రాజెక్టులకు మూడేళ్లకుపైగా వ్యవధిలో రూ.19,068 కోట్లను కేటాయించారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 19 అక్టోబర్2025

# జాన్వీ అవకాశం కోసం యాచించని ఒకే ఒక్కడు!



ఆ పాత్రకి సెట్ అవుతారనుకుంటే? కాల్ చేసి ఆడిషన్కి పిలవడం వంటివి జరుగుతుటాయి. అడిగితేగానీ అమ్మైనా పెట్టదంటారు. అలాంటింది ఇండస్ట్రీలో అవకాశాల కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయాల్సి ఉంటుందో తెలిసిందే. బ్యాక్ గ్రౌండ్ ఉన్నా అది కొంతవరకే పరిమితం. ఆతర్వాత ట్యాలెంట్ తోనే పైకి రావాలి. అవకాశాలు అందుకోగలగాలి. ఈ క్రమంలో రకరకాల దర్శక, నిర్మాతల్ని, యాడ్ ఏజన్సీలను కలవడం అవకాశాలు అడగడం జరుతుంది. ఆ పాత్రకి సెట్ అవుతారనుకుంటే? కాల్ చేసి ఆడిషన్కి పిలవడం వంటివి జరుగుతుటాయి. - బ్యాన్ నెట్‌ఫ్లిక్స్.. మెగా ఫ్యాన్స్ బిగ్ షాక్ స్టార్ డమ్ వచ్చే వరకూ ఏ నటి అయినా ఇది చేయక తప్పదు. స్టార్ కిడ్స్ కి సైతం ఇలాంటివి తప్పవు. ఇక జాన్వీ కపూర్ బాలీవుడ్ కి స్టార్ కిడ్ గా లాంచ్ అయిన సంగతి తెలిసిందే. మామ్ శ్రీదేవి ఒకప్పటి స్టార్ హీరోయన్..డాడ్ బోనీ కపూర్ పెద్ద నిర్మాత. అందుకే కరణ్ జోహార్ ...జాన్వీని లాంచ్ చేసే బాధ్యత తీసుకున్న సంగతి తెలిసిందే. -ధడక్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన జాన్వీ ధర్మ ప్రొడక్షన్స్ లోనే లాంచ్ అయింది. మినీ రివ్యూ: 'డెడ్‌పూల్ వుల్వరైన్' ఎలా ఉందంటే? అటుపై ఇతర బ్యానర్లలో అవకాశాలు అందుకుంటుంటుంది. ఒకవేళ అవకాశాలు రాకపోతే స్వయంగా మీరు ఏ నిర్మాతనైనా అవకాశాలు అడుగుతారా? అంటే జాన్వీ అడుగుతానని చెప్పింది. తనకు తెలిసిన ప్రతీ నిర్మాతను అవకాశం అడుగుతానంది.

ఒకవేళ పరిచయం లేకపోయినా వాళ్లదగ్గరకు వెళ్లి నిర్మొహ మాటంగా అడుగుతానంది. అయితే అప్పటికి తానేంటో ప్రూవ్ చేసుకున్న తర్వాత అలాంటి వాళ్ల దగ్గరకు వెళ్తానంది. అంతవరకూ తెలియని వారిని అవకాశాలు అడగనుంది. ముఖ్యంగా డాడ్ బోనీ కపూర్ ని అయితే అస్సలు అడగనంది. ఎందుకంటే నాన్ననే అవకాశం ఇవ్వండి అని అడగడం తనకెంత మాత్రం ఇష్టం లేదుట. డాడ్ విషయంలో ఆయనే జాన్వీ ట్యాలెంట్ గుర్తించి పిలిచి అవకాశం ఇచ్చేంతవరకూ సొంత బ్యానర్లో సినిమా చేయను అంటోంది. సొంత బ్యానర్లో నాన్నని అడిగితే వెంటనే సినిమా చేస్తారు. కానీ అలా అడిగి సినిమా చేయడం ఇష్టం లేదంది. మొత్తానికి అమ్మడు సొంత బ్యానర్ విషయంలో మంచి కండీషన్ పెట్టుకునే ముందుకెళు తోంది.

# థై స్లిట్ ఫ్రాక్‌లో కృతి సనోన్ చిల్లింగ్

కృతి సనోన్ ఓవైపు విదేశీ విహారయాత్రల పేరుతో ఆస్వాధనలో ఉంది. మరోవైపు మ్యాగజైన్ కవర్ షూట్లతోను విరుచుకుపడుతోంది కృతి సనోన్ ఓవైపు విదేశీ విహారయాత్రల పేరుతో ఆస్వాధనలో ఉంది. మరోవైపు మ్యాగజైన్ కవర్ షూట్లతోను విరుచుకుపడుతోంది. కృతి సోషల్ మీడియా ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఇందులో ఈ భామ లేటెస్ట్ ఫోటోషూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. %-%ది క్లోసెట్ డైలీ%-% కవర్ పేజీ కోసం కృతి ఇచ్చిన ఫోజులు యువతరంలో గుబులు రేపుతున్నాయి. ఇందులో థై స్లిట్ ఫ్రాక్ లో ఈ భామ వెరీ స్పెషల్ గా కనిపించింది. అలాగే ఎంపిక చేసుకున్న రెడ్ హాట్ దుస్తుల్లో ఏది బెస్ట్ అని మీరు భావిస్తున్నారు? అంటూ ఫజిల్ కూడా వేసింది కృతి. దీనికి అభిమానుల నుంచి అద్భుత స్పందనలు దక్కుతున్నాయి. బ్యాన్ నెట్‌ఫ్లిక్స్.. మెగా ఫ్యాన్స్ బిగ్ షాక్ కృతి సనోన్ బాలీవుడ్ లో ఓ వెలుగు వెలుగుతున్నా కానీ తెలుగు పరిశ్రమ వరకూ దురదృష్ట నాయిక. ఇక్కడ తాను నటించిన మూడు సినిమాలు వర్కవుట్ కాలేదు. 1నేనొక్కడినే- దోచేయ్- ఆదిపురుష్ ఇవన్నీ ఫ్లాప్ సినిమాలు. ఆదిపురుష్ ఫుల్ గా బ్యాడ్ నేమ్ కూడా తెచ్చింది. అయినా కృతికి మిమీ చిత్రంలో నటనకు గాను జాతీయ ఉత్తమనటిగా అవార్డు దక్కడంతో అన్ని చెడ్డ అపశ్రుతులు తొలగిపోయాయి. 2019లో తన సినిమా లుకా చుప్పి విజయాన్ని పురస్కరించుకుని కృతి సనన్ మంచి విరామం తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఆమె హాలిడే డెస్టినేషన్‌గా టర్కీలోని అంటాల్యను ఎంచుకుంది. కానీ ఇప్పటివరకూ ఈ టూర్ వీలుపడలేదు. ఇటీవల విడుదలైన క్రూ గ్రాండ్ సక్సెస్ ని ఆస్వాధించాక.. చివరికి ఇప్పటికి యాత్ర కుదిరింది. ప్రస్తుతం కృతి టర్కీలో విహారయాత్రను ఆస్వాధిస్తోంది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఫోటోలను పరిశీలించాక ఈ విషయం అర్థమైంది. %ూశ్రీంశీ =ఖుస% - మినీ రివ్యూ: 'డెడ్‌పూల్ వుల్వరైన్' ఎలా ఉందంటే? అయితే ఈ విహారయాత్రలో తనతో పాటే తన స్పెషల్ మ్యాన్ కూడా ఉన్నాడనేది నెటిజనుల ఆరోపణ. ప్రతి ఫోటోలో కృతి సంతోషంగా ఉంది. %-%ఎవరో స్పెషల్%-%తో %-%డేట్%-%లో ఉన్నానని కూడా గతంలో ప్రస్తావించినప్పుడు కృతి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రత్యేక వ్యక్తి ఎవరనేది అభిమానులకు ఆసక్తిని కలిగించింది. అందరినీ ఆశ్చర్యపరుస్తూ కృతి తన డేట్ %-%నీరో%-% అనే అందమైన కుక్క అని వెల్లడించింది. తన పర్యటనలో నీరో తనను కలుసుకుంది. కృతి నీరోను తనలాగే సోమరి అని ముద్దుగా అభివర్ణించింది. చనీరో చఅంటల్య చటర్కీ ట్రావెల్" అనే శీర్షికతో ఒక ఫోటోని కూడా షేర్ చేసింది.




## కీర్తి సురేష్ పెళ్లి అసలెవరితో?

# ఏంటీ రూమర్లు?



అదే సమయంలో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ కూడా చేసింది అమ్మడు.: హీరోహీరోయిన్ల పెళ్లికి సంబంధించి ఎన్నో రకాల వార్తలు ఎప్పుడూ వైరల్ అవుతూనే ఉంటాయి. దీంతో వాటిపై స్పందించడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించరు. కానీ అవే రూమర్లు ఎక్కువ అయితే ఒక్కోసారి స్పందిస్తుంటారు. తాజాగా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ కూడా అదే పని చేసింది. తన పెళ్లికి సంబంధించి వస్తున్న వార్తలపై రియాక్ట్ అయింది. అదే సమయంలో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ కూడా చేసింది అమ్మడు. తన చిన్ననాటి ఫ్రెండ్ ను కీర్తి సురేష్ వివాహం చేసుకుంటుందని గత కొద్ది రోజులుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. లేకుంటే ప్రముఖ కోలీవుడ్ కంపోజర్ తో ఏడడుగులు నడుస్తుందని టాక్ వినిపిస్తోంది. దీంతో తన అప్ కమింగ్ మూవీ రఘు తాత ప్రమోషన్స్ లో భాగంగా తన పెళ్లి వార్తలపై స్పందించింది. అభిమానులతో ముచ్చటిస్తూ క్లారిటీ ఇచ్చింది. విమర్శల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఇష్టపడతానని తెలిపింది. బ్యాన్ నెట్‌ఫ్లిక్స్.. మెగా ఫ్యాన్స్ బిగ్ షాక్ తానెప్పుడూ రూమర్లపై స్పందించనని తెలిపింది కీర్తి సురేష్. ఏదైనా రూమర్ పై క్లారిటీ ఇస్తే చాలు.. అదే నిజమని అందరూ భావిస్తారని చెప్పింది. అయితే తన యాక్టింగ్ తోపాటు సినిమాపై విమర్శలు చేస్తే తప్పకుండా స్వీకరిస్తానని పేర్కొంది. వాటి నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఇష్టపడతానని వెల్లడించింది. పర్సనల్ తోపాటు ఫ్యామిలీ విషయాల గురించి కామెంట్స్ చేస్తే వాటిని అసలు పట్టించుకోనని తెలిపింది కీర్తి సురేష్. వాళ్లు చేసిన కామెంట్స్ ను సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పింది. ముఖ్యంగా తన పెళ్లి వార్తల్లో నిజం లేదని తెలిపింది. కీర్తి పెళ్లి గురించి రూమర్స్ రావడం ఇదేం ఫస్ట్ టైమ్ కాదు. గతంలో చాలాసార్లు అనేక వార్తలు వైరల్ అయ్యాయి. వాటన్నింటినిపై ఆమె తల్లిదండ్రులు ఓసారి రియాక్ట్ అయ్యారు. తమ కుమార్తె వివాహం గురించి వస్తున్న రూమర్స్ నిజం కావని ఖండించారు. ఇప్పుడు కీర్తి రియాక్ట్ అయింది.– మినీ రివ్యూ: 'డెడ్‌పూల్ వుల్వరైన్' ఎలా ఉందంటే? ప్రస్తుతం కీర్తి కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి ఇప్పటికైనా అమ్మడు పెళ్లి రూమర్లు ఆగుతాయో లేదో చూడాలి. అసలు ఎవరితో కీర్తి పెళ్లి అని నెటిజన్లు అంటున్నారు. నేను శైలజ సినిమాతో టాలీవుడ్ లోకి వచ్చిన కీర్తి సురేష్.. మహానటి మూవీతో ఓ రేంజ్ లో అలరించింది. నేషనల్ అవార్డు కూడా అందుకుంది. ఇప్పుడు తెలుగు, తమిళంలో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటోంది. బాలీవుడ్ పై కూడా ఫోకస్ పెట్టింది కీర్తి సురేష్.

# ఇటలీలో.. హ్యాపీగా.. జాలీగా..!



మొన్నటిదాకా జెట్ స్పీడ్‌లో సౌత్ సినిమాల్లో నటిస్తూ సత్తా చాటిన పూజా హెగ్దే స్టార్ సినిమా అంటే చాలు ఆమె ఫస్ట్ ఆప్షన్ అనేలా ఛాన్సులు అందుకుంది. అయితే ఎప్పుడు ఒకే ఫాం కొనసాగించడం ఎవరి వల్లా కాదు అలానే పూజా బేబీ కూడా మొన్నటిదాకా తెలుగు, తమిళ సినిమాల్లో వరుస క్రేజీ సినిమాలు చేసి ఈమధ్య కాస్త స్లో అయ్యింది. ప్రభాస్ తో రాధే శ్యాం, చరణ్ తో ఆచార్య ఈ రెండు సినిమాల ఫలితాలు అమ్మడికి బ్లాక్ మార్క్ పడేలా చేశాయి. అయితే ఈ సినిమాల ఫలితాలు అమ్మడి వల్ల మారలేదు కానీ వాటి ఫెయిల్యూర్ మాత్రం పూజా మీద గట్టిగానే పడింది. బ్యాన్ నెట్‌ఫ్లిక్స్.. మెగా ఫ్యాన్స్ బిగ్ షాక్ ఇక మహేష్ గుంటూరు కారంలో హీరోయిన్ గా ఒక షెడ్యూల్ అయిపోయాక సినిమా నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత తెలుగులో ఒక్క ఆఫర్ కూడా అందుకోలేదు. ఈలోగా హిందీ లో రెండు సినిమాలు చేసిన పూజా హెగ్దే ప్రస్తుతం అక్కడ షాహిద్ కపూర్ తో దేవ సినిమాలో నటిస్తుంది. ఐతే పూజా బేబీ ఈమధ్యనే సూర్య 44 సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. కార్తీక్ సుబ్బరాజు డైరెక్షన్ లో ఈ సినిమా తెరకెక్కుతుంది. ప్రస్తుతం సౌత్ నుంచి అదొక్కటే ఆఫర్ కాగా దానిలో తన టాలెంట్ చూపించాలని అనుకుంటుంది అమ్మడు. ఇదిలా ఉంటే ప్రజెంట్ అమ్మడు ఫ్రీ టైం ని ఫుల్ గా ఎంజాయ్ చేస్తుంది. విహార యాత్రలు చేస్తూ ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఫాలోవర్స్ ని అలరిస్తుంది. పూజా బేబ్ ప్రెజెంట్ ఇటలీలో ఉంది. అక్కడ దిగిన ఫోటోలను ఇన్ స్టాలో షేర్ చేస్తూ ఫ్యాన్స్ ని ఇంప్రెస్ చేస్తుంది అమ్మడు. – మినీ రివ్యూ: 'డెడ్‌పూల్ వుల్వరైన్' ఎలా ఉందంటే? ఇటలీ ట్రిప్ లో హ్యాపీగా జాలీగా అమ్మడు ఎంజాయ్ చేస్తుంది. అక్కడ ఐస్ క్రీం.. పిజ్జా ఇలా ఫుడ్ అంతా తింటూ ఆ టెస్ట్ ఆస్వాదిస్తుంది. పూజా ఇటలీ నుంచి పోస్ట్ చేస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. తెలుగులో రీసెంట్ గా నాగ చైతన్యతో జత కట్టే ఛాన్స్ అందుకుందని టాక్. ఐతే అది అఫీషియల్ గా మాత్రం చెప్పలేదు. పూజా హెగ్దే తిరిగి తెలుగు సినిమాల్లో నటించాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు. టాలీవుడ్ లో ఒక్క ఛాన్స్ వస్తే మాత్రం ఈసారి తన గ్లామర్ తో రెచ్చిపోవాలని అనుకుంటుంది పూజా హెగ్దే.

# చీరలో మెరిసిపోతున్న అందాల మీనాక్షి




మీనాక్షి చౌదరి కెరీర్ విషయానికి వస్తే, ఆమె ఇటీవలే పలు చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. % మీనాక్షి చౌదరి తన తాజా ఫోటోషూట్ లో అందరిని ఆకట్టుకునేలా కనిపించారు. ఆమె ధరించిన తెల్ల చీరలో చూడచక్కని అందంతో మెరిసిపోతున్నారు. ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, అంటూ క్యాప్షన్ ఇచ్చారు. టాలీవుడ్ లో తన గ్లామర్ మరియు స్టైలిష్ లుక్స్ తో మెప్పిస్తున్న ఈ బ్యూటీ, తన ట్రెడిషనల్ లుక్ లో కూడా అంతే ఆకర్షణీయంగా ఉంటుందని మరోసారి రుజువు చేశారు. మీనాక్షి చౌదరి కెరీర్ విషయానికి వస్తే, ఆమె ఇటీవలే పలు చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అక్కినేని సుశాంత్ సరసన 'ఇచ్చట వాహనములు నిలపరాదు' చిత్రం ద్వారా తెరపై అడుగుపెట్టిన ఈ అందాల రాశి, ఆ తరువాత రవితేజతో 'ఖిలాడి' లో నటించి తన గ్లామర్ షోతో అందరినీ మెప్పించారు. కానీ, ఆ సినిమా ఆశించినంత హిట్ అవ్వకపోయినా, మీనాక్షికి ప్రేక్షకులలో మంచి గుర్తింపు తీసుకొచ్చింది. %ూశ్రీంశీ =ఖుస% - ఫ్లాపిచ్చి డబ్బు వృధా చేసాడు.. రాళ్లతో కొట్టండి ఆమె నటించిన 'హిట్ 2' చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో ఆమెకు మంచి అవకాశాలు వచ్చాయి. గ్లామర్ పాత్రల్లోనే కాకుండా నటనకు కూడా స్కోప్ ఉన్న పాత్రల్లో ఆమె మెరవడం ఆమెకు మరింత మంచి పేరును తీసుకొచ్చింది. మహేష్ బాబు 'గుంటూరు కారం', విజయ్ 'ది గోట్' వంటి చిత్రాల్లో నటించింది. ఇక ఆమె రీసెంట్ గా నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రంలో కూడా నటిస్తున్నారు. దీపావళి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం, ఆమెకు మంచి హిట్ అందించే అవకాశం కల్పిస్తుందని అందరూ భావిస్తున్నారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌తో 'మెకానిక్ రాకీ' లోనూ, మెగా హీరో వరుణ్ తేజ్ సరసన 'మట్కా' చిత్రంలోనూ నటిస్తున్నారు. వీటితో పాటు, విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న మరో చిత్రంలోనూ మీనాక్షి నటిస్తున్నారు. %ూశ్రీంశీ =ఖుస% - కాస్మెటిక్ సర్జరీలపై కృతి సనోన్ అభిప్రాయమిదీ మీనాక్షి చౌదరి ఇంత వరకూ తాను చేసిన సినిమాల్లో నటనతో మాత్రమే కాకుండా తన గ్లామర్, స్టైల్, ప్రత్యేకతతో ప్రేక్షకుల మనసులను దోచుకున్నారు. ప్రస్తుతం ఆమె తన కెరీర్ లో మంచి స్థాయికి చేరుకోవాలని, వరుసగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 19 అక్టోబర్2025

# బాలి ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా.. అయితే, ఈ విషయం తెలుసుకోవాల్సిందే..!






ఇండోనేషియాలోని బాలి అందమైన ద్వీపం అనే సంగతి అందరికి తెలిసిందే. అది ప్రపంచ ప్రసిద్ధిచెందిన గమ్యస్థానం కావడంతో నిత్యం టూరిస్టులతో రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రదేశంలో ఇకపై టూరిస్టులు బైక్ రైడింగ్ చేసే అవకాశం లేకుండాపోనుంది. అందుకు సంబంధించిన చర్యలను అధికారులు త్వరలోనే అమలుచేయనున్నారు. బాలిలో సందర్శనీయ ప్రాంతాలను చూడటానికి టూరిస్టులు ఎక్కువగా మోటార్ బైక్‌లను అద్దెకు తీసుకొని విహరిస్తుంటారు. కొన్ని కారణాల నేపథ్యంలో అధికారులు త్వరలోనే టూరిస్టులకు బైక్ రైడింగ్ బ్యాన్ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. బాలిబాలిని సందర్శించే చాలా మంది టూరిస్టులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా పోలీసులకు చిక్కుతున్నారని తెలిసింది. దీంతో పర్యాటకులపై ఎక్కువ మొత్తం ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సమీప భవిష్యత్తులోనే అధికారులు టూరిస్టులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఈ కొత్త నిబంధన ఎప్పుడు అమలులోకి వస్తుందనే దానిపై స్పష్టత లేకున్నా అది త్వరలోనే అమలుచేయబోతున్నారని తెలిసింది. పర్యాటకులు చాలా మంది వ్యాలిడ్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్‌లు లేకుండా, కొన్ని సందర్భాల్లో నకిలీ లైసెన్స్‌లతో వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడుతున్నారని తెలిసింది. దీంతో అలాంటి వాటిని అరికట్టాలనే ఉద్దేశంతో స్థానిక ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకురావాలని చూస్తోంది. బైక్ రైడింగ్‌కు ప్రత్యామ్నాయంగా ట్రావెల్ ఏజెంట్లు అందించే కార్లను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే, ఈ నిర్ణయంపై స్థానిక టూర్ ఆపరేటర్లు పెదవి విరుస్తున్నారు. పెరిగిన ట్రాఫిక్ రద్దీని తోసిపుచ్చలేని పరిస్థితుల్లో.. ప్రతి ఒక్కరూ ఆ ద్వీపంలో తిరగడానికి కార్లను ఉపయోగించడం ప్రారంభిస్తే వాహనాల రద్దీ మరింత పెరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ ద్వీపం చుట్టూ అనేక పర్యాటక ఆకర్షణలు, మారుమూల ప్రాంతాలు ఉన్నాయని, వాటన్నింటినీ కార్లలోనే వెళ్లిరావడం కుదరదని అంటున్నారు. అలాంటి ప్రదేశాలకు ద్విచక్ర వాహనాలే ఉత్తమమని సూచిస్తున్నారు. అలాగే ఈ మోటర్‌బైక్‌ల వినియోగంతో టూరిస్టులు సొంతంగా విహరించే అవకాశం ఉంటుందని, దాంతో వారు తక్కువ సమయంలోనే మరిన్ని ప్రదేశాలు తిరిగి రావచ్చని చెబుతున్నారు. కాగా, విదేశీ పర్యాటకులపై అన్నిరకాల మోటర్‌బైక్ రైడింగ్‌లను నిషేధించనున్నారా.. లేక ఈ నిబంధనను అమలు చేయడానికి మరికొన్ని మార్గాలు ఏమైనా ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియరాలేదు. కానీ, ఒక్క విషయం మాత్రం కచ్చితంగా చెప్పొచ్చు. విదేశీ పర్యాటకులు బాలిని సందర్శించేటప్పుడు త్వరలో కఠిన నిబంధనలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మీరూ త్వరలోనే బాలికి వెళ్లాలనుకుంటే స్థానిక చట్టాలు, నియమ నిబంధనలను తెలుసుకొని పర్యటించడం మంచిది. అనవసరంగా లేనిపోని పనులు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు.

## చలో ఊటీ..

## రూ. 9వేలకే ఆరు రోజుల ట్రిప్. పూర్తి వివరాలు



వేసవి సెలువులు ముగిసేందుకు సమయం దగ్గరపడింది. దీంతో చాలా మంది టూర్‌లకు ప్లాన్‌లు చేస్తున్నారు. మీలాంటి వారి కోసమే తెలంగాణ టూరిజం ప్రత్యేకంగా ఓ మంచి టూర్ ప్యాకేజీని అందిస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ టూర్ కర్ణాటకలోని పలు ప్రాంతాల మీదుగా సాగుతుంది. మొత్తం 5 రాత్రులు, 6 రోజులుగా వేసవి సెలువులు ముగిసేందుకు సమయం దగ్గరపడింది. దీంతో చాలా మంది టూర్‌లకు ప్లాన్‌లు చేస్తున్నారు. మీలాంటి వారి కోసమే తెలంగాణ టూరిజం ప్రత్యేకంగా ఓ మంచి టూర్ ప్యాకేజీని అందిస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ టూర్ కర్ణాటకలోని పలు ప్రాంతాల మీదుగా సాగుతుంది. మొత్తం 5 రాత్రులు, 6 రోజులుగా ఈ ట్రిప్ సాగుతుంది. బెంగళూరు – ఊటీ – మైసూర్ పేరుతో తీసుకొచ్చిన ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం..

**మొదటి రోజు:** టూర్‌లో భాగంగా తొలి రోజు మధ్యాహ్నం హైదరాబాద్‌లో టూర్ ప్రారంభమవుతుంది. యాత్రి నివాస్ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు, బషీర్‌బాగ్ నుంచి సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణించి ఉదయం బెంగళూరు చేరుకుంటారు.

**రెండో రోజు:** రెండో రోజు బెంగళూరులో లోకల్ సైట్ విజిటింగ్ ఉంటుంది. ఇందులో భాగంగా బుల్ టెంపుల్, లాల్ బాగ్, విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఇస్కాన్ టెంపుల్ విజిటింగ్ ఉంటుంది. రాత్రి బెంగళూరులోనే బస చేయాల్సి ఉంటుంది.

**మూడో రోజు:** ఇక మూడో రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఊటీ బయలుదేరాల్సి ఉంటుంది. మధ్యాహ్నానికి ఊటీ చేరుకుంటారు. ఆ తర్వాత లోకల్ సైట్‌సీయింగ్ ఉంటుంది. దొడ్డపెట, బొటానికల్ గార్డెన్ చూడొచ్చు. భోజనం తర్వాత రాత్రి ఊటీలో బస ఉంటుంది.

**నాలుగో రోజు:** టూర్‌లో నాలుగో రోజు ఉదయం మైసూర్ వెళ్తారు. సాయంత్రానికి మైసూరు చేరుకుంటారు. అనంతరం బృందావన్ గార్డెన్ సందర్శన ఉంటుంది. రాత్రికి భోజనం, మైసూరులో బస ఉంటుంది.

**ఐదో రోజు:** ఐదో రోజు ఉదయం 7 గంటలకు మైసూరు లోకల్ సైట్‌సీయింగ్ ఉంటుంది. ఇందులో భాగంగా చాముండేశ్వరి ఆలయం, మైసూరు మహారాజ ప్యాలెస్, బిగ్ బుల్ టెంపుల్ చూడొచ్చు. అనంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణం మొదలవుతుంది. రాత్రి మైసూర్ నుంచి తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది.

**ఆరో రోజు:** ఆరో రోజు తెల్లవారుజామున ఉదయం 06.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. దీంతో టూర్ ముగుస్తుంది.


**ధర విషయానికొస్తే..**


ఇక ఈ టూర్ ధర విషయానికొస్తే.. నాన్ ఏసీ బస్ ప్యాకేజీ పెద్దలకు రూ. 9,900, 5 నుంచి 12సంవత్సరాల పిల్లలకు రూ.7,920 ఉంటుంది. టూర్ ప్యాకేజీలో వోల్వో బస్సులో ప్రయాణం, నాన్ ఏసీ వసతి కవర్ అవుతుంది.

## యూరప్‌లోని ఆ రెండు దేశాలు ఉద్యోగులకు

# డిజిటల్ నోమాడ్ వీసాలను అందిస్తున్నాయి..

**యూరప్‌లోని స్పెయిన్, పోర్చుగల్ దేశాలు ఉద్యోగులకు తీపి కబురు చెప్పాయి. భారీ వేతనంతో పనిచేసేవారికి డిజిటల్ నోమాడ్ వీసాలను జారీ చేస్తున్నాయి. పూర్తి వివరాల కోసం ఇక్కడ చదవండి.అమెజాన్‌లో క్లాతింగ్, స్మార్ట్ వాచీలు, జ్యువలరీ లగేజీలపై 60% వరకు తగ్గింపు కొవిడ్-19 చాలా మందికి తమవారిని దూరం చేసి ఎనలేని బాధను మిగల్చడమే కాకుండా కొంత మందికి వర్క్ పరంగా కొంచెం రిలీఫ్‌ని ఇచ్చిందనే చెప్పాలి. కరోనా కారణంగా ఐటీ కంపెనీలన్నీ దాదాపు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ ఆప్షన్ కల్పించింది. దీంతో చాలా మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఆన్‌లైన్ వ్యవహారాలు చూసుకునేవారంతా ఇంటి నుంచే పని చేయడం మొదలెట్టారు. అయితే, ఇక్కడ కొంత మంది ఈ వర్క్ ఫ్రం హోమ్ అవకాశాన్ని కూడా తమకు నచ్చిన విధంగా ప్లాన్ చేసుకోవడం ప్రారంభించారు. కరోనా టైమ్‌లో ఇంట్లో నుంచే పనిచేసినా తర్వాత తమకు నచ్చిన చోటుకు వెళ్లి హాయిగా వర్క్ చేస్తూనే వెకేషన్ ట్రిప్‌లను ప్లాన్ చేసుకుంటున్నారు.**





అలా ప్రత్యేకంగా సెలవులు పెట్టకుండానే తమకు నచ్చిన ప్రదేశాన్ని చూసొస్తున్నారు. అలాంటి వారికే ఇప్పుడు యూరప్‌లోని రెండు దేశాలు డిజిటల్ నోమాడ్ వీసాలను జారీ చేస్తున్నాయి. దీంతో ఉద్యోగులు ఇకపై ఆయా దేశాలకు వెళ్లి మరీ తమ పనులు కొనసాగించుకోవచ్చు. ఆ విశేషాల గురించి పూర్తిగా తెలుసుకుందాం.

**డిజిటల్ నోమాడ్ వీసాలంటే..**

ఈ కొత్త వీసాల విధానంతో ఉద్యోగులు తమ సొంత దేశంలో కాకుండా ప్రపంచంలోని ఉత్తమ ప్రదేశాల్లో విహరిస్తూ పని చేసుకునే సౌలభ్యం ఉంటుంది. ఇది ఒక విధంగా చెప్పాలంటే వర్క్ ఫ్రం అదర్ కంట్రీస్‌గా చెప్పుకోవచ్చు. అందుకు అనుగుణంగానే అనేక దేశాలు ఎక్కువ మంది సందర్శకులను ఆకర్షించడానికి డిజిటల్ నోమాడ్ వీసాలను అందిస్తున్నాయి. తాజాగా ఆ జాబితాలో స్పెయిన్, పోర్చుగల్ చేరాయి. నివేదికల ప్రకారం 30 కన్నా ఎక్కువ దేశాలు పని చేసే నిపుణులకు, స్వయం ఉపాధి చేసుకునేవారికి ఈ 'డిజిటల్ నోమాడ్ వీసా'లను అందిస్తాయి. దీంతో సదరు వ్యక్తులు ఆయా దేశాల్లోని మారుమూల ప్రాంతాల నుండి కూడా పని చేసుకునేందుకు అనుమతిస్తారు.

**అదంత సులువేం కాదు..**

అయితే, డిజిటల్ నోమాడ్ వీసాలు పొందడం అంత సులువైన పనేంకాదు. అందుకు సంబంధించిన అర్హత ప్రమాణాలు చాలా కఠినమైనవనే చెప్పాలి. అందులో అతి ముఖ్యమైనది కనీస బ్యాంక్ బ్యాలెన్స్ కలిగి ఉండటం లేదా ఆయా దేశాలను బట్టి మారే నిర్దిష్ట ఆదాయాన్ని సంపాదించడం. ఉదాహరణకు పోర్చుగల్‌ను తీసుకుంటే.. ఆ దేశంలో కనీస వేతనం కన్నా పర్యాటకులు నాలుగు రెట్లు సమానమైన నెలవారీ ఆదాయాన్ని కలిగి ఉండాలి. అలా ప్రస్తుత కరెన్సీ ప్రకారం లెక్కిస్తే నెలకు ఆ3,040 పోర్చుగల్‌లో సంపాదిస్తే అది మనవద్ద సుమారు ?2.7 లక్షలు కలిగి ఉండాలి. అలా మీరు కూడా ఆ రెండు యూరప్ దేశాల్లో ఎక్కడైనా విహరిస్తూ వర్క్ చేసుకోవాలనుకుంటే అందుకు సంబంధించిన విషయాలను ఇక్కడ తెలుసుకోవచ్చు.

**స్పెయిన్ వీసా కావాలంటే..**

స్పెయిన్ అందించే డిజిటల్ నోమాడ్ వీసా పొందాలనుకుంటే వారు స్వయం ఉపాధి కలిగి ఉండాలి. అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు చూపించాలి. ఫ్రీలాన్సర్లు వారి పనికి సంబంధించిన రుజువులను, ఆర్థిక వనరులను చూపించాలి. అలాగే స్పెయిన్‌లో కాకుండా ఇతర దేశాల్లో ఉన్న కంపెనీల్లో పనిచేసే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి రిమోట్‌గా పని చేయడానికి గల అనుమతులు ఉండాలి. స్పానిష్ సంస్థల నుండి గరిష్టంగా 20 శాతం సంపాదించే వారు కూడా ఈ వీసా పొందడం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే యూరోపియన్ యూనియన్ లేదా యూరోపియన్ ఎకనామిక్ ఏరియాలో నివసించని వారు, స్పెయిన్‌లో చట్టవిరుద్ధంగా నివసించని వ్యక్తులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

**అక్కడ ఎంతకాలం ఉండొచ్చు..**

ప్రస్తుతం స్పెయిన్ ఈ వీసాలను ఒక ఏడాది కాలవ్యవధితో అందిస్తోంది. అయితే, ఒక వ్యక్తి స్పెయిన్‌లో టూరిస్ట్ వీసాపై ఉన్నట్లయితే వారు అక్కడి నుండే మూడు సంవత్సరాల పాటు ఉండేందుకు %ణచీం% కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత వారి వీసాను ఐదు సంవత్సరాల వరకు పునరుద్ధరించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. అది కూడా వారు ఏడాదిలో ఆరు నెలల పాటు స్పెయిన్‌లో ఉంటేనే అర్హులవుతారు.

**పోర్చుగల్ వీపా కావాలంటే..**

ఇక పోర్చుగల్ %ణ%8 డిజిటల్ నోమాడ్ వీసా కోసం ఎవరైనా స్వయం ఉపాధి పొందేవారు, ఫ్రీలాన్సర్లు, వారి పనికి రుజువును చూపించుకోగల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిమోట్‌గా పని చేయడానికి అనుమతి ఉండే ఉద్యోగులై ఉండాలి. పోర్చుగల్ బయట ఉన్న కంపెనీల్లో ఉద్యోగి ఎవరైనా అప్లై చేసుకోవచ్చు. అలాగే యూరోపియన్ యూనియన్ లేదా యూరోపియన్ ఎకనామిక్ ఏరియాలో నివాసం ఉండని వారు కూడా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు...

**అక్కడ ఎంత కాలం ఉండొచ్చు..**

పోర్చుగల్‌కు వలస వెళ్లాలని చూస్తున్న రిమోట్ కార్మికుల కోసం రెసిడెన్సీ పర్మిట్ కార్డ్ లేదా పాస్‌పోర్ట్ వీసాను అందిస్తోంది. అయితే, ఈ దేశం కూడా డిజిటల్ నోమాడ్ వీసాలను ఏడాది కాలవ్యవధితోనే అందిస్తోంది. మరోవైపు పర్మిట్ కార్డ్ రెండేళ్లపాటు చెల్లుబాటవుతుండగా దాన్ని మూడేళ్లకు పునరుద్ధరించుకునే వెసులు బాటు ఉంది. దీంతో మీరూ ఏదైనా కంపెనీలో పనిచేస్తూ భారీ జీతం పొందుతున్నవారైతే ఆలస్యం చేయకుండా ఈ వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు

# వైన్స్ టెండర్ల జోరుకు ఏమైంది.?

**-డబ్బులు లేవంటారా.?లేక**
**ముందుకు రావట్లేదు అంటారా.?**
**-వున్నా కష్ట కాలంలో ఎ**
**ఒడుకు రిస్క్ అనుకుంటున్నారా.?**
**-భారీగా పెంచిన టెండర్లు 3 లక్షలే కారణమా.?**
**-ప్రభుత్వం అనుకున్నది ఒకటి అయింది ఒకటి**
**అనుకుంటున్నారా ?**
**-ప్రభుత్వం ఏమైనా ఆలోచనల్లో పడ్డాదంటారా.?**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది మద్యం దుకాణాల (వైన్స్ షాప్స్) టెండర్ ప్రక్రియలో ఊహించని స్థాయిలో చల్లబడి కనిపిస్తోంది. గతంలో లైసెన్సుల కోసం వ్యాపారులు కోట్ల రూపాయల బిడ్లు వేయగా, ఈసారి మాత్రం టెండర్లకు సరైన స్పందన లేకపోవడం అధికార వర్గాలను, పరిశ్రమ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**రాజకీయ వాతావరణం – ఒక ప్రధాన కారణం..**
రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారుతున్న నేపథ్యంతో కొత్త పాలనలో విధానాలు మారతాయనే అనుమానం వ్యాపార వర్గాల్లో నెలకొంది. నూతన ప్రభుత్వం మద్యం విధానంలో మార్పులు చేయవచ్చన్న అంచనాలు వ్యాపారులను కొంత వెనక్కి నెట్టాయి. ఫలితంగా టెండర్లలో పోటీ తగ్గింది.

**పెరిగిన లైసెన్స్ ఫీజులు – వ్యాపారుల భయం..**
వైన్ షాపుల లైసెన్స్ ఫీజులు భారీగా పెరగడం మరో కారణంగా కనిపిస్తోంది. లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంటుందని భావించి అనేకమంది వ్యాపారులు టెండర్లో పాల్గొనలేదు. మద్యం అమ్మకాలపై పన్నులు, ఎక్సైజ్ డ్యూటీలు కూడా అధికంగా ఉండడంతో వ్యాపార లాభదాయకత తగ్గింది.

**గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాల క్షీణత..**
గత కొన్ని నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం తగ్గిందని ఎక్సైజ్ అధికారులే చెబుతున్నారు. పంటల వైఫల్యం, ఉపాధి లోపం కారణంగా గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. ఈ ప్రభావం టెండర్లలో కూడా ప్రతిఫలించింది.

**నిబంధనల మార్పు – మరో ఆటంకం**
ఈసారి టెండర్ షరతులను కఠినతరం చేయడం కూడా స్పందన తగ్గడానికి దారితీసింది. లైసెన్స్ పొందిన తర్వాత వ్యాపారం చేసే ప్రాంతాలపై పరిమితులు, ( సి సి టీవీ )వ్యవస్థ తప్పనిసరి చేయడం, మద్యం రవాణాపై కఠిన నిబంధనలు వంటి రవాణాపై కఠిన నిబంధనల ప్రభవం ఆ అంశాలు చిన్న వ్యాపారులను వెనుకకు నెట్టాయి.

**మద్యం వ్యతిరేక ఉద్యమాల ప్రభావం..**
కొన్ని జిల్లాల్లో మద్యం వ్యతిరేక ఉద్యమాలు మళ్లీ బలపడుతుండటంతో వైన్స్ వ్యాపారులు భయపడుతున్నారు. సమాజంలో ప్రతిష్టాపరంగా ఉండే వ్యాపారులు ఇలాంటి లైసెన్సులకు దూరమవుతున్నారు.

**ఎందుకు ఈ పరిస్థితి..**
భారీగా పెరిగిన లైసెన్స్ ఖర్చులు, మారుతున్న రాజకీయ పరిస్థితులు, కఠిన నిబంధనలు, గ్రామీణ అమ్మకాల తగ్గుదల %–% ఇవన్నీ కలిసి ఈసారి తెలంగాణాలోవైన్స్ టెండర్లు జోరును కోల్పోయేలా చేశాయి.

# మాంసం దుకాణల్లో కరువైన పరిశుభ్రత ప్రమాణాలు

**-తనిఖీలు మరిచిన అధికారులు**
**-ఈగల మోతతో నిండిపోతున్న దుకాణాలు**
**-మాంసం విక్రయాలను గాలికి వదిలేసినట్లేనా**
**-ఎక్కడపడితే అక్కడ అనుమతులు**
**లేని చిన్న చిన్న కబేలాలు**
**-పాచి మాంసం అమ్ముతున్న మటన్ షాపులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)మాంసం దుకాణాల వద్ద పరిశు భ్ర వాతావరణం ఏర్పరచడంలో జీఏచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమైన్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నగరంలోని పలు కాలనీలలో ఉన్న మాంసం దుకాణాలో అపరిశుభ్ర వాతవరణం నెలకొందని, నాణ్యమైన మాంసాన్ని సరసమైన ధరలకు ప్రజలకు విక్రయించడం లేదని పలువురు తెలిపారు. మాంసం దుకాణాలలో ఖచ్చితంగా మాంసం ధరను తెలుపుతు బోర్డు ఉంచాల్సి ఉండగా అవి ఎక్కడ కూడా కనిపించడం లేదని, మటన్, చికెన్ నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలి మాంస ప్రియులను మోసానికి గురి చేస్తున్నారు. ముఖ్యంగా మాంసం దుఖాణాలలో యద్దేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడుచున్నట్లు పలువురు అరోపించారు. అలాగే మరికొన్ని షాపుల్లో బక్కచిక్కిన, రోగాల భారిన పడిన మేకలను, కోళ్ళ మాంసాన్ని కస్టమర్లకు కట్టబెట్టి ప్రజల ప్రాణాలతో చలగాటమాడుచున్నరని, దీనిని సంభందిత అధికారుల దృష్టికి తెచ్చినను ఎలాంటి ప్రయోజనం లేదని తమ ఆవేదనను వ్యక్తం చేసారు.

**మాంసం దుకాణాల్లో ఈగల మోత..**
మాంసం దుకాణాలలో అపరిశుభ్రత ఒక ఎత్తు కాగా ఈగల మోత మరోక ప్రధాన సమస్య. మాంసం వ్యాపారులు నిర్లక్ష్యంతో తమ దుకాణాలలో ఆరోగ్య పరిరక్షణ చర్యలను గాలికి వదిలేయడంతో ఈగల మోతతో దుకాణాలు అనారోగ్య కేంద్రాలుగా మారాయి. అలాగే విక్రయానికి సిద్దంగా ఉన్న మాంసాన్ని కూడా సురక్షితంగా ఉంచక పోవడంతో ఈగలు వాలడం గమనార్హం. ఇక మాసాన్ని కోయడానికి ఉపయోగించే కత్తులను కూడా అపరిశుభ్ర ప్రదేశాలలో ఉంచడం వల్ల వాటిపై కూడా ఈగలు వాలడంతో పరిస్థితులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది.

**జాడేలేని అధికారుల పర్యవేక్షణ..**
మాంసం దుకాణాలపై అకస్మికంగా దాడులు జరిపి, మాంసం నాణ్యత, పరిశుభ్రతను పర్యవేక్షించడమే కాక ఆరోగ్య ప్రమాణాలను పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారుల జాడేలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పేరుకు పోతున్న వ్యర్థాలు..**
మాంసం దుకాణాలలో వ్యర్థాల తరలింపు సక్రమంగా లేకపోవడం వల్ల పలు ఆనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుచున్నాయని, చేపల పెంపకంలో మాంసం వ్యర్థాల వినియోగం పెరగడంతో వ్యాపారులు వ్యర్థాలతో సైతం వ్యాపారాలు చేస్తు వ్యర్థాలను నిల్వచేయడం వల్ల దుకాణాల ఆవరణలో తీవ్ర దుర్గందంతో వాతావరణం కలిషితమై తీవ్ర అనారోగ్య సమస్యలు ప్రభలుచున్నాయని ప్రజలు తెలుపుచున్నారు. అలాగే కోడి, మేక మాంసం వ్యర్థాలను రోడ్ల వెంబడి వేయకుండా కఠిన చర్యలు తీసుకొని, నగరంలోని చికెన్, మటన్ దుకాణాలను గుర్తించి వాటి నుండి వ్యర్థాలను సేకరించి తరలించే కట్టుదిట్టమైన చర్యలను జీఎచ్ఎంసీ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మాంసం వ్యాపారులు పాటించాల్సిన నిభందనలు..**
మాంసం వ్యాపారులు విధిగా తమ దుకాణాలలో లీక్ ప్రూఫ్ చత్త బుట్టలను వాడాలని, పనిముట్లను కంటేనర్లను విధిగా వేడి నీటి శుభ్రం చేయాలని, దుకాణం పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని, దుకాణాలలో పనిచేసే సిబ్బంది అప్రాన్లు, హెడ్ గేర్, గ్లౌస్ లను విధిగా వాడాల్సి ఉంది.దుకాణాల పరిసరాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి, దుకాణాలలో అవసరాల మేరకు నీటిని నిల్వ ఉంచాలి, సిబ్బందికి చర్మ వ్యాధులు లేకుండా జాగ్రత్త పడాలని, క్రమం తప్పకుండా గోళ్ళను కత్తిరించాలి. మాంసం దుకాణాలలో ఈగలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే బాలకార్మికులతో పనిచేయించరాదు. వినియోగదారుల సౌకర్యార్థం పిర్యాధులు చేసేందుకు సంభందిత అధికారుల పేర్లు పోన్ నెంబర్లతో బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంది.

# అక్రమ నిర్మాణం సీజ్

**-సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ**
**నిర్మాణాలపై చర్యలు**
**-అక్రమ నిర్మాణాలు చేస్తే వెంటనే సీజ్ చేస్తాం**
**డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఏసీపి**
**పావని**
**-అక్రమ నిర్మాణాలపై రాజకీయ నాయకుల**
**అండదండలు సహించేది లేదు**
**-రాజకీయ నాయకులు అంటే ప్రజల**
**సమస్యలు తీర్చాలి, అవినీతి అక్రమాలను**
**ప్రోత్సహించడం కాదు**

ప్రజాప్రశ్న EFFECT


ప్రజాప్రశ్న
రాజకీయ నాయకుల పేరుతో
అక్రమ నిర్మాణాల జోరు





సీతాఫలమండి(ప్రశ్న న్యూస్)సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో గత టౌన్ ప్లానింగ్ అధికారుల సిబ్బంది పుణ్యమా అని అక్రమ నిర్మాణాలు జోరుగా సాగినాయి. ప్రస్తుతం అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఏసిపి పావని కఠినంగా వ్యవహరించడం పై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కఠినంగా వ్యవహరించకుంటే అవినీతి అక్రమాలే రాజ్యమేలుతాయని అక్రమ నిర్మాణాలతో హైదరాబాద్ కు తీవ్ర ముప్పు పొంచి ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జోరుగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై రాజకీయ నాయకుల పేరుతో అక్రమ నిర్మాణాల జోరు అనే కథనంపై డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఏసిపి పావని స్పందించి వెంటనే అక్రమ నిర్మాణం ను సీజ్ చేశారు. శనివారంసికింద్రాబాద్ సర్కిల్ జోనల్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ టాస్క్ ఫోర్స్ , టౌన్ ప్లానింగ్ విభాగం సంయుక్తంగా వారసిగూడ, సికింద్రాబాద్ పరిధిలోని హౌస్ నం. 12-11-236/1 వద్ద జరుగుతున్న అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు. గతంలో పలుమార్లు నోటీసులు జారీచేసిన స్థానిక రాజకీయ నాయకుల అండదండతో అధికారుల ఆదేశాలను చెత్తబుట్ట దాఖలు చేసి అక్రమ నిర్మాణం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో చాలామంది బిల్డర్లు అక్రమ నిర్మాణాలకు తెగబడి చిన్న చిన్న గల్లీలలో నిబంధనలకు విరుద్ధంగా ఐదు ఆరు అంతస్తుల నిర్మాణాలు చేసి లక్షలు అమ్మకాలు చేసి కోట్లు గడిస్తున్నారని కొంతమంది రాజకీయ నాయకులకు వాటాలు ఇవ్వడంతో వాళ్లు కూడా మద్దతు తెలిపి అధికారులు రాకుండా అడ్డుకోవడం సరైనది కాదని జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు ఇలాంటి అక్రమ విమానాలు ఎవరు ప్రోత్సహించారని వెంటనే వాటిని సీజ్ చేస్తామన్నారు సీజ్ చేసిన భవనాలలో ఎవరైనా నిర్మాణ పనులు చేసిన గృహప్రవేశాలు చేసిన చట్టపరమైన కేసులు పెట్టి కోర్టు ముందు హాజరు పరుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్ రావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సికింద్రాబాద్ సర్కిల్%–%29 పరిధిలోని అన్ని అనధికార నిర్మాణాలపై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని ఏసిపి పావని, అధికారులు హెచ్చరించారు.

## తెలంగాణ జేఏసీ బీసీ బంద్ కి మద్దతుగా బైక్ ర్యాలీలో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) బీసీ బిల్లుపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ 42% బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీలకు మద్దతుగా వ్యాపార, వాణిజ్య సంస్థలు,అందరూ స్వచ్ఛందంగా బంద్ పాటించాలన్నారు. ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించకుండా అడ్డుకుంటుందని ఆరోపించారు.కామారెడ్డి డిక్లరేషన్ కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తేలేదు. రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్లు బీసీ రిజర్వేషన్లకు సుముఖంగా లేవని విమర్శించారు. బీసీలపై ఆ రెండు పార్టీలు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పి ఎస్ సి ఎస్ మాజీ చైర్మన్ రాజు, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## దీపావళి సామాగ్రి అమ్మే షాపు యజమానులు అన్ని అనుమతులు , జాగ్రత్తలు తీసుకొని ,సరసమైన ధరలకే అమ్మాలి-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా ప్రజలకు దీపావళి పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.దీపావళి పండుగ ఉత్సాహంలో ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.దీపావళి సామాగ్రి అమ్మే షాప్ యజమానులు అన్ని అనుమతులు, జాగ్రత్తలు తీసుకొని, కస్టమర్లకు సరసమైన ధరలకే అమ్మాలన్నారు. పటాకులు కాల్చేటప్పుడు పిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే పాల్గొనాలన్నారు.ఎర్రబట్టలు , సింథటిక్ వస్త్రాలు ధరించకుండా, పత్తి దుస్తులు ధరించడం మంచిదన్నారు.పటాకులు కాల్చే ప్రదేశం సమీపంలో నీరు, ఇసుక, బకెట్ లేదా తడి గుడ్డ వంటివి సిద్ధంగా ఉంచుకోవాలనీ సూచించారు. ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన పటాకులనే వినియోగించాలనీ తెలిపారు.పటాకులు కాల్చేటప్పుడు పెట్రోలు, డీజిల్ వంటి దహన పదార్థాల దగ్గర వెళ్లకూడదనీ, పర్యావరణహిత పటాకులను ఉపయోగించడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చు అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అగ్ని ప్రమాదాలు, గాయాలు సంభవించినపుడు వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని లేదా అగ్నిమాపక శాఖను సంప్రదించాలనీ సూచించారు.ఏదన్నా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 101లేదా 8712699263 కు తెలియజేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం..!!

**- 42 శాతం బి,సి రిజర్వేషన్ను**
**పార్లమెంట్లో పెట్టి బిల్లును ఆమోదించాలి..**
**- పాపకొల్లు రహదారిపై రాస్తారోకో చేసిన విద్యార్థి సంఘాలు..**



జూలూరుపాడు (ప్రశ్నన్యూస్) అక్టోబర్ 18 : బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడి బీసీ ఐక్య కార్యచరణ కమిటీ బంద్ పిలుపులో భాగంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జులూరుపాడు మండలంలో ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలను బంధు నిర్వహించడం జరిగింది అనంతరం పాపకొల్లు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలో ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు బీసీ బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జీవోతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద నిన్న హైకోర్టు స్టే విధించడంతో రిజర్వేషన్ అమలు స్థానిక సంస్థ ఎన్నికలు నిలిచిపోడానికి దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రతినిత్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు బిల్లు కేంద్రానికి పంపించిన స్పందించలేదన్నారు శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కి పంపించిన ఆమోదించకపోవడం వల్ల రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు, బిజెపి కులతత్వ మనోవాద పార్టీ అయినందున కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని మనోధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు, ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు పసుపులేటి పవన్, వినోద్ కుమార్ సురేష్ కృష్ణ వెంకటేష్ నరేష్ అవినాష్ సతీష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588